ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, ఏప్రిల్ 11, 2026 | సంపుటి - 22 | సంచిక 194 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## నేడు ఇస్లామాబాద్‌లో
# శాంతి చర్చలు

- అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ బృందం, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ బృందం మధ్య జరగనున్న చర్చలు

- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు



**ఇస్లామాబాద్, ఏప్రిల్10(నినాదం):** అమెరికా`ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనా లు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి.

▸▸తరువాయి 2లో..

## హరివంశ్ సింగ్‌కు మరో ఛాన్స్

- రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం
- మరోమారు డిప్యూటి ఛైర్మన్ అయ్యే అవకాశం



రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు.

▸▸వివరాలు 6లో..

## హైదరాబాద్–విజయవాడ.. విమానాలు
### ఫ్లై 91 విమాన సర్వీసును ప్రారంభించిన రామ్మోహన్ నాయుడు



**హైదరాబాద్, నినాదం:** హైదరాబాద్ ` విజయవాడ మధ్య ప్రయాణించే వారికి శుభవార్త. ప్రాంతీయ విమానయాన సంస్థ ఫ్లై 91 తన నూతన సర్వీసులను తెలుగు రాష్ట్రాల మధ్య అధికారికంగా ప్రారంభించింది.

▸▸తరువాయి 2లో..

# అన్నా.. నన్ను దేవుడే పంపిండు

- మీతో కలిసి పని చేయమని చెప్పిండు
- ఎర్రవల్లిలో కెసిఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కెసిఆర్



బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను పలకరిస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. 'అన్నా.. నన్ను దేవుడే పంపిండు. మీతో కలిసి పని చేయమని' అంటూ కేసీఆర్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. తాజా రాజకీయాలు, కాంగ్రెస్ తీరును ఆయన కెసిఆర్‌తో పంచుకున్నారు. తెలంగాణకు నష్టం జరుగుతున్న సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరమున్నదని, మీతో కలిసి పనిచేయమని దేవుడే నన్ను మీదగ్గరికి పంపించిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసిపనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అంటూ మనసులోని మాటను వ్యక్తం చేశారు.

**జగిత్యాల ,ఏప్రిల్ 10(నినాదం):** ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసానికి తొలిసారి వచ్చిన జీవన్ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె.సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.'

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై
# కాంగ్రెస్ ఫోకస్

జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు.

### మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ

- ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు
- రాజకీయ లబ్ధికోసమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే
- తెలంగాణలో డీ లిమిటేషన్ నూ రేవంత్ నివేదిక సమర్పణ

కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు.



కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు.

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 10(నినాదం):** దేశ రాజధాని ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

2

## తదుపరి డిజిపిగా సివి ఆనంద్?
### ప్రభుత్వ పరిశీలనలో ఆయన పేరు



**హైదరాబాద్, నినాదం:** తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం.

2

## ఆత్మహత్య చేసుకున్న యువతి
### పెళ్లి చేసుకోలేదని హెచ్ఐవి రక్తం ఎక్కించిన ఘటనలో

ప్రేమించిన అమ్మాయికి హెచఐవీ రక్తం ఎక్కించిన ఘటనలో సదరు యువతి రమణి(23) ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా
# ఎందుకు నానబెట్టారు

- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా
- కేవలం కమీషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత



▸▸వివరాలు 6లో..

## 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ

- ముఖ్య అతిథిగా హాజరు కానున్న కెసిఆర్
- ఆయన సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్న జీవన్
- మాజీమంత్రులు కొప్పుల, ఎల్. రమణల వెల్లడి

కాంగ్రెస్‌ను వీడిన టి.జీవన్ రెడ్డి బీఆరఎస్‌లో చేరడం ఖాయమైంది. శుక్రవారం ఎర్రవల్లిలో గులాబీ అధినేత కేసీఆర్ ను కలిసిని జీవన్ రెడ్డి ఏప్రిల్ 20వ తేదీన పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా కప్పుకోనున్నారు. జీవన్ రెడ్డి బీఆరఎస్‌లో చేరుతున్నందున జగిత్యాలలో తమ ప్రాబల్యాన్ని చాటేందుకు భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ భావిస్తోంది.

2

## రాష్ట్రపతి, ప్రధానులతో గవర్నర్ భేటీ



**న్యూఢిల్లీ, నినాదం:** తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధానులను కలుసుకున్నారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులు అయ్యాక ఆయన తొలిసారి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ముర్మును కలసారు. తనను గవర్నర్‌గా నియమించి పనచేసే అవకాశం ఇచ్చినందుకు క్రుతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రధాని మోడీతో కూడా ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ గవర్నర్‌కు అభినందనలు తెలిపారు.

## కేబుల్ జర్నలిస్టులకు అక్రిడేషన్లు
### వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్న కమిషనర్

**హైదరాబాద్, నినాదం:** కేబుల్ న్యూస్ ఛానల్ జర్నలిస్టులు రాష్ట్ర,జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డులు పొందటానికి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి హెచ్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగర కేంద్రంగా స్టూడియోలు కలిగి, స్థానికంగా, జిల్లాలలో ప్రసారాలు అందించే చానళ్ళు రాష్ట్ర,జిల్లా స్థాయిలో కార్డులు పొందటానికి, జిల్లా స్థాయిలో స్టూడియోలు కలిగిన వారు ఆయా జిల్లాల్లో కార్డులు పొందటానికి నేరుగా



# డిజిపి ఎదుట లొంగిపోయిన కేశాలు

- మొత్తం 42 మంది ఆయుధాలతో లొంగుబాటు
- వారికి పునరావాసం కల్పిస్తామన్న శివధర్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్10(నినాదం):** తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు అగ్రనేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ డిప్యూటీ కమాండర్ సోడిమల్ల కేశాలు లొంగిపోయారు. అతనితోపాటు మొత్తం 42 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. ఛత్తీస్‌గఢ్` తెలంగాణ సరిహద్దుల్లోని కర్రె గుట్టల నుంచి వచ్చి వీరంతా లొంగిపోయారు. ములుగు, భూపాలపల్లి మీదుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోతున్నట్లు ప్రకటించారు.అనంతరం సరిహద్దుల నుంచి పోలీసులు వీరిని వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. మావోయిస్టు నేత హిడ్మా గెరిల్లాను వదిలి దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి వెళ్లిన తర్వాత బెటాలియన్ బాధ్యతలను బడ్సే దేవాకు, కేశాలుకు అప్పగించారు. అయితే, కొన్ని రోజులు కిందటే కమాండర్ దేవా.. తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుపోయారు.

2

## కేబినేట్ ఎజెండా
# ముందే లీక్

- కీలక అంశాలు సైతం ముందే వెల్లడి
- గతంలో ఇలా జరిగితే ఎన్టీఆర్ కేబినేట్ రద్దు చేశారు
- సమాచారం లీక్ అయితే అందుకు మంత్రులదే బాధ్యత
- కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సీరియస్ వార్నింగ్
- జలధార తదితర పథకాలపై ప్రచారం కల్పించాలని ఆదేశం

**అమరావతి,ఏప్రిల్ 10(నినాదం):** సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం దాదాపు 3 గంటలకు పైగా సాగింది. ఈ సమావేశంలో.. అమరావతికి ఆమోదంపై కేంద్రానికి, ప్రధాని మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడంతో పాటు.. కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది కేబినెట్.. అయితే, ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత.. మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన సీఎం చంద్రబాబు.. కీలక సమాచారం లీక్ అవుతున్న అంశంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

2

## పేదల ప్రభుత్వంపై
# ప్రతిపక్షాల బురద రాజకీయం

- వారికంటిన బురదను మాకు అంటించే ప్రయత్నం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం,ఏప్రిల్ 10(నినాదం):** ప్రతిపక్షానికి చెందిన కొంతమంది వారికి అంటిన బురదని అధికార పార్టీకీ, అధికార పార్టీ నాయకులకు అంటించాలని చూస్తున్నారని ఎవరు ఎన్ని కారుకూతలు కూసినా భవిష్యత్తులో ఇందిరమ్మ ప్రభుత్వంని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.



# ఎసి వాటర్ పడడంపై గొడవ

**అన్నా చెల్లెళ్లపై తండ్రీకొడుకుల దాడి**

**బ్లేడ్‌తో దాడిచేయడంతో గాయాలు.. ఆస్పత్రికి తరలింపు**

**కాకినాడ, ఏప్రిల్10(నినాదం):** చిన్న విషయాలకే ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న ఘటనలు ఎన్నో చూశాం. కూర్చుని మాట్లాడుకోవాల్సిన విషయాల్లో కూడా కత్తులు, రాడ్లతో దాడులకు తెగబడుతున్నారు. ఈ ఘటనల్లో కొందరు గాయాలపాలై బయటపడుతుండగా.. మరికొందరు ఏకంగా ప్రాణాలే కోల్పోతున్న పరిస్థితి. కాకినాడ జిల్లా జగ్గంపేటలో ఏసీ వాటర్ విషయంపై తలెత్తిన చిన్న వివాదం.. దాడిగా మారి.. ఇద్దరిని తీవ్ర గాయాలపాలయ్యేలా చేసింది. జగ్గంపేట మండలం నెహ్రూ కాలనీలో ఓ ఇంటి వాకిలిలో ఏసీ నుంచి వచ్చే వాటర్ పడుతుందన్న కారణంగా పక్కంటి మహిళ, ఆమె అన్నపై తండ్రీకొడుకులు దారుణాని కి పాల్పడ్డారు. అన్నాచెల్లెలిపై బ్లేడ్‌తో దాడి చేయడంతో వారు గాయపడ్డారు. మొదట ఈ వివాదం చిన్నగా మొదలైనప్పటికీ తరువాత చిలికి చిలికి గాలివానగా మారింది. ఆగ్రహంతో తండ్రీకొడుకులు కలిసి పక్కంటి మహిళ, ఆమె అన్నపై బ్లేడ్‌తో విచాక్షణారహితంగా దాడి చేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలవడంతో వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరికీ వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తండ్రీకొడుకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏసీ వాటర్ విషయంలో తండ్రీకొడుకులు ప్రవర్తించిన తీరు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# పాముకాటులో బాలిక మృతి

**ఆస్పత్రికి తరలించే లోపే హరీమన్న ప్రాణం**

**కాకినాడ, ఏప్రిల్10(నినాదం):** యు.కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటలో విషాద ఘటన చోటు చేసుకుంది. పాము కాటుకు గురై చప్పా దీపిక(13) అనే బాలిక మృతి చెందింది. ఇంట్లో మంచం విద నిద్రిస్తుండగా రాత్రి 2.30 సమయంలో బాలికను త్రాచుపాము కరిచింది. ఎలుక కరిచిందని భావించి తల్లి మల్లీశ్వరికి చెప్పగా ఉదయం ఆసుపత్రికి వెళ్ళి ఇంజెక్షన్ చేయిద్దామని చెప్పడంతో మరలా బాలిక నిద్రించింది. అయితే తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇబ్బందిగా ఉందని బాలిక చెప్పడంతో ఆసుపత్రికి తీసుకెల్దామని బంధువులను పిలిచింది. అప్పటికే బాలికకు నోటి వెంట నురగలు రావడంతో అంబులెన్స్‌కు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. ఆసుపత్రిలో వివరాల కోసమని ఆధార్ కార్డు వెతుకుతుండగా మంచం పక్కనే తాచుపాము కనిపించడంతో కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. పాము కరిచిందని నిర్ధారించుకుని హుటాహుటిన బాలికను ఆస్పత్రికి తరలించాలని భావించగా.. అంబులెన్స్ వచ్చేలోపే పరిస్థితి విషమించడంతో దీపిక ప్రాణాలు కోల్పోయింది. ఇటీవలే కోనపాపపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి పరీక్షలు రాసి తొమ్మిదో తరగతిలోకి దీపిక ప్రవేశించింది. బాలిక మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

### ప్రేమజంట ఆత్మహత్య : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

**పల్నాడు, ఏప్రిల్10(నినాదం):** కొండవీడు కోటలో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ ప్రేమ వివాహాన్ని తల్లిదండ్రులు నిరాకరించడంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రేమజంట పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. యువతీ, యువకుడు ప్రేమించుకోగా.. వారి ప్రేమను పెద్దలు నిరాకరించారు. యువతికి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. దీంతో ఆమె తీవ్రంగా మనస్తాపానికి గురైంది. పెళ్లి అయిన తర్వాత కూడా ప్రేమించిన వ్యక్తిని మరిచిపోలేక... భర్తను వదిలేసి ప్రేమికుడి వద్దకు వచ్చేసిందా యువతి. ఇద్దరు కలిసి జీవించాలని అనుకున్నప్పటికీ పెద్దలు తమ వివాహాన్ని అంగీకరించరని భావించిన ప్రేమజంట కఠిన నిర్ణయం తీసుకుంది. ఈనెల 7న కొండవీడు కోటకు వచ్చిన వీరిద్దరు.. అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వెంటనే గమనించిన స్థానికులు వారిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ చనిపోయారు. వీరిద్దరూ గుంటూరుకు చెందిన వారుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ జంట మృతిపై వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

# శ్రీకాకుళం సాగునీటిని గాలికి వదిలేసిన వైసిపి



**జిల్లాకు సాగునీటి వసతి కల్పించడమే లక్ష్యం**

**వంశధారతో సమస్యలను తీర్చే ప్రయత్నం**

**కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**శ్రీకాకుళం, ఏప్రిల్10(నినాదం):** ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు. 2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు. త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

BRANCH SHIFTING

మా విలువైన కస్టమర్ల కోసం, మా
PAKALA
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి
13.07.2026 నుండి మార్చబడు
తుంది. నూతన చిరునామా క్రింద
ఇవ్వబడినది;
Muthoot Finance Ltd
Ground Floor, Market Street,
Opp. SBGR College, Near RTC Bus Stand,
Pakala, Thirupathi District,
Andhra Pradesh State, Pin - 517112.
Phone No - 09188903959, 08138909950.
Email id : mgpak2647@muthootgroup.com
"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".
మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.
Muthoot Finance
A Muthoot M George Enterprise

BRANCH SHIFTING

మా విలువైన కస్టమర్ల కోసం, మా
VIJAYAWADA - BHAVANI PURAM
బ్రాంచ్ నూతన ప్రాంగణం లోనికి
13.07.2026 నుండి మార్చబడు
తుంది. నూతన చిరునామా క్రింద
ఇవ్వబడినది;
Muthoot Finance Ltd
Ground Floor, H.No : 76-13-100/1,
Near Church Centre,
Revenue ward - 29 A, Bhavanipuram,
Vijayawada, NTR District,
Andhra Pradesh State, Pin – 520012.
Phone No - 09188904179, 08138910698.
Email id : mgbha751@muthootgroup.com
"ఏదైనా ఫిర్యాదు ఉంటే దయచేసి 0484 4804074 కు కాల్ చేయండి".
మీ నిరంతర చేయూత మరియు మద్దతును కోరుతున్నాము.
Muthoot Finance
A Muthoot M George Enterprise

# పోలీసుల కిరాతక చర్యలకు ఓ హెచ్చరిక

**తమిళనాడు మధురై కోర్టు తీర్పుపై సర్వత్రా చర్చ**

**పోలీసులపై పనిభారం తగ్గించాలని సూచనలు**

**విజయవాడ, ఏప్రిల్10(నినాదం):** ఆరేళ్ళ క్రితం తమిళనాడులో జరిగిన 'లాకప్ డెత' కేసులో ట్రయల్ కోర్టు విచారణ ముగిసి తొమ్మిది మంది పోలీసులను ముద్దాయిలుగా ఖరారు చేస్తూ వారందరికీ మరణ శిక్ష విధించడం సంచలనం కలిగించింది. ఈ తీర్పుపై ఇప్పుడు సర్వత్రా చర్చ సాగుతోంది. పోలీసుల అతిపై కోర్టు సరైన తీర్పు ఇచ్చిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్టేషన్‌లో టార్చర్ పెట్టే వారికి ఈ కేసు ఓ హెచ్చరికగా సూచిస్తున్నారు. ఇక వివరాల్లోకి వెళితే...కరోనా సమయంలో సదరు లాక్‌డౌన్ నిబంధనల్ని అతిక్రమించారన్న కారణంతో చిరు వ్యాపారులైన తండ్రీకొడుకులను అరెస్ట్ చేశారు. వారిని ఆ రాత్రంతా చిత్రహింసలకు గురిచేయగా ప్రాణాలు కోల్పోయారు. కస్టడీ లోకి తీసుకున్న ఆరోగ్యవంతులైన ఇద్దరు పౌరులు ఒక్క రోజులోనే అనారోగ్యంతో మరణించడానికి పోలీసులు పెట్టిన చిత్రవధ ఏకైక కారణం అన్నది తేలిపోయింది. ఆ దుర్మార్గపు చర్య ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, ఆందోళన నింపగా మద్రాస్ హైకోర్టు సుమోటోగా కేసుని స్వీకరించి?సిబిఐ దర్యాప్తునకు ఆదేశించింది. ఫలితంగా పోలీసుల నేరం నిరూపణ అయ్యింది. బాధాకరమైన విషయమేమిటంటే ఆ మృతులిద్దరూ కరోనా లాక్‌డౌన్ నిబంధనల్ని కూడా అతిక్రమించలేదని. అది కూడా తప్పుడు బనాయింపు అని. ఆ సంఘటనకి బాధ్యులైన 9 మంది పోలీసు అధికారులకూ నేడు కోర్టు మరణ శిక్ష విధించడం సరైన తీర్పు. ఇంకా పైకోర్టులో అప్పీళ్లు, న్యాయ ప్రక్రియలు పూర్తయ్యి అంతిమ తీర్పు రావడం ఎలాఉన్నా ప్రస్తుతానికి బాధిత కుటుంబాలకు ఊరట. అధికారాన్ని అడ్డుపెట్టుకుని,చేయగూడని పనులు చేసే అధికారులకు ఇది ఒక హెచ్చరిక. ఇదే సమయంలో దేశం పోలీసు సంస్కరణల దిశగా ఆలోచించాలి. వారు ఎదుర్కొంటున్న విపరీత పని ఒత్తిడి సమస్య, సిబ్బంది లేమి, దర్యాప్తు, శాంతి భద్రతలను వేర్వేరుగా నిర్వహించే యంత్రాంగం లాంటివి తీర్చుతూనే, తప్పుడు పనులు చేసే అధికారుల్ని వెంటనే కఠినంగా శిక్షించే ఏర్పాట్లు ఉండాలని అంటున్నారు. సమాజానికి అప్పుడే శాంతిభద్రతలకు భరోసా ఉంటుందని భావిస్తున్నారు.

# ప్రారంభోత్సవానికి రెడీ అవుతున్న భోగాపురం

**జూలైలో ప్రారంభోత్సవానికి తేదీలు ఖరారు**

**జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన డేట్లు ఫిక్స్ చేసిన ప్రభుత్వం**

**ప్రారంభోత్సవానికి ప్రధాని మోడీకి ఆహ్వానం**

**విశాఖపట్నం,ఏప్రిల్10(నినాదం):** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫె?లల ఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్ 45 రోజుల్లో సిద్ధం కానుంది. భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈ విమానాశ్రయం వల్ల ఉత్తరాంధ్ర లోని పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుంది. ఫార్మా, మత్స్య పరిశ్రమల ఎగుమతులకు ఈ విమానాశ్రయం కేంద్ర బిందువుగా మారనుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేందప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ పెంపు


**పెంచిన డిఎతో 50.7% నుండి 52.8 శాతానికి చేరిన కరువు భత్యం.**

**సంస్థపై నెలకు రూ. 2.82 కోట్ల అదనపు భారం.**

**కార్మికుల సంక్షేమమే ధ్యేయం**

**మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి**





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్ టి సి ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 2.1 శాతం కరువు భత్యాన్ని ప్రకటించింది. ఈ ఏడాదిలో సంస్థ ఉద్యోగులకు జనవరిలో చెల్లించవలసిన డీఏను అందజేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శుక్రవారం సంస్థ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమార 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరుతుందని రవాణా శాఖ మంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు పెంచిన డిఎ వివరాలు ప్రకారం.. ప్రస్తుతం ఆర్టీసీ ఉద్యోగులకు 50.7 శాతం డీఏ అందుతుండగా, తాజాగా 2.1 శాతం డి ఏ ను పెంచారు. పెంచిన ది ఎ తో కలిపి మొత్తం డీఏ 52.8 శాతానికి చేరింది. ఈ పెంపు 2026 జనవరి 1 నుండి అమల్లోకి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గత మూడు నెలలకు (జనవరి, ఫిబ్రవరి, మార్చి) సంబంధించిన బకాయిలను ఏప్రిల్ నెల జీతంతో పాటు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనున్నారు. డి ఎ పెంచడం వలన ఆర్టీసీ సంస్థపై ప్రతి నెలా రూ. 2.82 కోట్ల మేర ఆర్థిక భారం పడుతున్నా కానీ కార్మికుల భవిష్యత్తు కోసం డీఏ భారాన్ని మోస్తున్నట్లు వాపోయారు .

**ఆర్టీసీ సిబ్బందికి డీఏలన్నీ చెల్లింపులు.**

గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న డీఏలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం వరుసగా విడుదల చేస్తూ వస్తోందన్నారు. 2024 మే నెలలో ఆర్ పి ఎస్ 2017 అమలు చేసిన తర్వాత, తాజాగా 2.1 శాతం డీఏను మంజూరు చేయడంతో, ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలన్నీ పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. గత ఏడాది జూలై 2025లో ప్రభుత్వం 2.1 శాతం డీఏను పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయం.

**మంత్రి పొన్నం ప్రభాకర్..**

ప్రజా పాలన ప్రభుత్వం మొదటి నుండి ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ 2.1 శాతం డీఏ పెంపుతో పాటు అంతకుముందు పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. త్రిసభ్య కమిటీ ద్వారా దీర్ఘకాలంగా విధులకు దూరమైన వారిని తిరిగి తీసుకోవడం, కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం ఆర్టీసీ ఆసుపత్రిని ఆధునీకరించామని తెలిపారు. సంస్థలో ఖాళీలను భర్తీ చేసేందుకు నియామకాల చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సంస్థ ఉద్యోగులకు డీఏను చెల్లించాలని మంత్రి ఆదేశించడం పట్ల టీజీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఈ డీఏ పెంపుతో ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ఎండీ నాగిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈడీ లు సిహెచ్.వెంకన్న, ఖుస్రో షా ఖాన్, రాజశేఖర్, సాల్మన్, ఎఫ్ఏ విజయపుష్ప, సిటీఎం ఎం అండ్ సి శ్రీధర్, సిపిఎం ఉషాదేవి, సీసీఈ కవిత తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి డీఎంఎంఓ మిఠాయి ప్రసాద్

# వీరకుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 10 (నినాదం):** సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా మాస్ మీడియా అధికారిగా సేవలందిస్తున్న మిఠాయి ప్రసాద్ వీరకుమార్ పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. కుప్పంలోని ద్రవిడియన్ యూనివర్సిటీకి ఆయన సమర్పించిన పరిశోధనా పత్రానికి గాను ఈ గౌరవం లభించింది. ముఖ్యంగా త్రాగునీటి వసతుల వద్ద పరిశుభ్రత లోపించడం వల్ల, నీరు కలుషితమై ప్రజలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, ఆరోగ్యపరమైన ఇబ్బందులపై ఆయన సమగ్రంగా అధ్యయనం చేశారు. ఈ పరిశోధన ప్రక్రియ అంతా ఎస్.వి. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ రెడ్డి మార్గదర్శకత్వంలో కొనసాగింది. ప్రసాద్ వీరకుమార్ సాధించిన ఈ విజయం పట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం. వసంతరావు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీవాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శశాంక్, డాక్టర్ నాగ నిర్మల, డాక్టర్ ప్రవీణ్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొని వీరకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేద ప్రజల సంక్షేమం కోసం పక్కనపెట్టి కమిషన్ల కోసం రాజకీయం : బిఆర్ఎస్ పార్టీ

**ఇందిరమ్మ ఇల్లులు ప్రారంభించిన**

**దుబ్బాక నియోజకవర్గం**

**ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి**



**చేగుంట, ఏప్రిల్ 10 (నినాదం):** చేగుంట పట్టణ కేంద్రం లో పట్టణానికి చెందిన లబ్ధిదారుడు దాసరి పద్మ, కృష్ణ దంపతుల, ఇందిరమ్మ ఇళ్లను, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, తో, కలిసి శుక్రవారం రోజు చెరుకు శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు, వారి కుటుంబ సభ్యులు, రాష్ట్ర ప్రజా ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, సి హెచ్ శ్రీనివాస్ రెడ్డికి, నాకు ఇల్లు రావడానికి కృషి చేసిన మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ కి, ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. అదేవిధంగా దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం, ఏర్పాటైన రెండున్నర సంవత్సరాలలో, మన దుబ్బాక నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి, పేద కుటుంబాల, సొంత ఇంటి కలను నెరవేర్చాము, అని అన్నారు. అతిత్వరలోనే చేగుంట పట్టణంలో కూడా 50 ఇళ్లకు, శ్రీకారం చుట్టబోతున్నాము, అని అన్నారు. గత ప్రభుత్వంలో, పేద ప్రజల సంక్షేమం పక్కకు పెట్టి, కమిషన్ ల కోసం, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది, అని అన్నారు.. ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాలకు, సన్నబియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక సంక్షేమాలను, పేద ప్రజలకు, అందించి వారి ఆశీర్వాదాలు అందుకుంటున్నాము, అని అన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎఎంసి ఛైర్మెన్, తాడేం వెంగళరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, బోనాల సర్పంచ్ సుకన్య నాగులు, ఉపసర్పంచ్ నాగరాజు, ఎఎంసి డైరెక్టర్ బాల్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు ఎం .శ్రీనివాస్, వడియారం సర్పంచ్ సాయి కుమార్ గౌడ్,యువ నాయకులు సంద్రుగు శ్రీకాంత్,గ్రామ వార్డు సభ్యులు నాగులు, నరేశ్,భూపతి, చిన్న శివునూరు ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# అగ్ని ప్రమాదంపై పూర్తి నివేదిక అందించాలి

**ఎమ్మెల్యే వేముల వీరేశం**

**జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్**



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్10 (నినాదం) :** నల్గొండ జిల్లా, చిట్యాల మండలం వెలిమినేడు సమీపంలోని నాస్ ఫార్మసిటికల్ ప్రైవేట్ లిమిటెడ్ లో సంభవించిన అగ్ని ప్రమాదం పై పూర్తి విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ,జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ లు ఆదేశించారు. శుక్రవారం ప్రమాదం సంభవించిన నాస్ ఫార్మాస్యూటికల్ లేబరేటరీని తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం సంభవించడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు .చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖ, స్థానిక తహసిల్దారు, ఎంపీడీవోలు ప్రమాద సంఘటనపై తక్షణమే నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంతేకాక నాస్ కంపెనీకి ఉన్న అనుమతులపై నివేదిక ఇవ్వాలని, ఉద్యోగుల భద్రత పట్ల తీసుకున్న చర్యలపై పోలీసులు నివేదిక సమర్పించాలని కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆదేశించారు. గురువారం రాత్రి చిట్యాల మండలం, వెలిమినేడు వద్ద ఉన్న నాస్ ఫార్మస్యూటికల్ లో రియాక్టర్ వద్ద సంభవించిన అగ్ని ప్రమాదంలో ఉద్యోగులు వెంకటేశ్వర్లు ,లక్ష్మణ్ కుమార్లు గాయపడగా ,వీరిని హైదరాబాద్ లోని డిఆర్డిఓ అపోలో ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితి పై ఎప్పటికప్పుడు ఆసుపత్రి వారితో మాట్లాడడం జరుగుతున్నదని, అంతేకాక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రమాద సంఘటనపై విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించడం జరిగిందని, ముఖ్యంగా సంఘటన జరగడానికి గల కారణాలు, ప్రమాదం అనుకోకుండా జరిగిందా లేదా ఎవరి తప్పిదం వలన సంభవించిందా అన్నది తెలియజేయాలని, సాంకేతికపరంగా సమస్య కారణంగా ప్రమాదం తలెత్తితే అందుకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. నాష్ కంపెనీకి పొల్యూషన్ అనుమతితో పాటు, ఇతర అనుమతుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. చిట్యాల ప్రాంతంలో ఉండే పరిశ్రమలు చుట్టుపక్కల ప్రజలు, కార్మికులు కాలుష్యం బారిన పడకుండా చూడడంతో పాటు, కార్మికులు, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఉందని ఎవరి ప్రాణాలకు హాని కలిగినా యాజమాన్యంపై చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రత్యేకించి పరిశ్రమలో పనిచేసే ఉద్యోగుల భద్రత చూసుకోవాల్సిన బాధ్యత పూర్తిగా యాజమాన్యంపై ఉందని, అలాగే పర్యావరణాన్ని సైతం ఎప్పటికప్పుడు కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు . జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరిని హైదరాబాదులోని డి ఆర్ డి ఎల్ అపోలో ఆస్పత్రికి పంపించి మెరుగైన చికిత్స అందించడం జరుగుతున్నదని ,ప్రమాద సంఘటనపై వివిధ శాఖల విచారణ నివేదికలను కోరడం జరిగిందని, ప్రమాదంలో గాయపడిన ఉద్యోగుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కంపెనీ తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, ఇతర అధికారులు ఉన్నారు.

# యువతకు సువర్ణావకాశం

**ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్**

**పథకానికి దరఖాస్తుల ఆహ్వానం**

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 10 (నినాదం ):** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని సంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. పేరుగాంచిన సంస్థలలో శిక్షణ కల్పించడం ద్వారా యువతకు వ్యాపార రంగంపై పూర్తి అవగాహన కల్పించడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ పథకానికి 18 నుండి 25 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండి 10వ తరగతి, ఇంటర్మీడియట్, పారిశ్రామిక శిక్షణ సంస్థ లేదా పాలిటెక్నిక్ విద్యను పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ప్రస్తుతం డిగ్రీ లేదా పీజీ చివరి సంవత్సరం చదువుతున్న వారు, దూరవిద్య ద్వారా చదువుతున్న విద్యార్థులు కూడా దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం 12 లక్షల రూపాయల లోపు ఉండాలని సూచించారు. ఈ శిక్షణ కాలపరిమితి 6 నుండి 9 నెలల వరకు ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు 9 వేయిల రూపాయల గౌరవ వేతనం చెల్లిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం దరఖాస్తుల నమోదు కోసం pminternship.mca.gov.in అనే వెబ్‌సైట్ చూడాలని ఆయన కోరారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే సహాయం కోసం 1800 11 6090 అనే ఉచిత సంఖ్యను సంప్రదించాలని వివరించారు.

సంపాదకీయం

# మహిళా బిల్లుతో పాటు.. సమాజ రుగ్మతలపైనా చర్చించాలి !

భారతదేశం స్వాతంత్ర్యం సముపార్జించి 80వ ఏట అడుగిడబోతున్నాం. సాధించిన విజయాలకన్నా అపజయాలే ఎక్కువగా చర్చించుకోవాలి. దేశంలో నేటికి సరైన విద్యావైద్యం అందడం లేదు. పేదలు పేదలుగానే జీవిస్తున్నారు. గృహవసతి అందని ద్రాక్షగా మారింది. విద్య డబ్బున్న వారికే అందుబాటులో ఉంది. విద్యకోసం మధ్యతరగతి, పేదలు అప్పులు చేయాల్సి వస్తోంది. సరైతన వైద్యం అందుబాటులోకి రావడం లేదు. కనీసం జిల్లాకో మంచి కార్పోరేట్ తరహా ఆస్పత్రి కట్టలేకపోయారు. ఫీజు రియంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు వేలకోట్లు వెచ్చిస్తున్న ప్రభుత్వాలు సొంతంగా ఆస్పత్రులను నిర్మించలేక పోతున్నాయి. అన్నింటికి మించి గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వాడేస్తున్నారు. అత్యాచారాలకు లెక్కేలేదు. మహిళల భద్రత డొల్ల అని చెప్పకతప్పదు. అమ్మాయిల అపహరణ కేసులు పెరుగుతున్నాయి. సమాజాన్ని పట్టిపపీడిస్తున్న ఈ సమస్యలపై నిరంతరం చర్చించాలి. నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. ఈ క్రమంలో మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదిం చేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశం కానుంది. దీనికి చట్టబద్ధత కల్పించడం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ల క ల సాకారం కానుంది. 2029 ఎన్నికల నుంచి ఇది అమల్లోకి రానుంది. భారత్‌లోని కోట్లాది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబంగా చూడాలి. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన సుదీర్ఘ నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నా వారికి ఇన్నాళ్లూ చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం దక్కలేదు. ఈ దేశానికి వారు అందిస్తున్న సేవలు అపారమైనవే కాదు... అమూల్యమైనవి. కూడా. అయినా ఇంకా చిన్నచూపు చూస్తూనే ఉన్నారు. పిల్లను క నే యంత్రాలుగా భావిస్తున్నారు. నిజానికి ప్రతిరంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు ఎందరో దిక్సూచిగా నిలిచారు. శాస్త్ర, సాంకేతిక రంగాల నుంచి ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి లలితకళల వరకు దేశాభివృద్ధిలో మహిళలే అగ్రగామిగా ఉన్నారు. కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు స్త్రీ సాధికారత దిశగా అనుకూల వాతావరణాన్ని సృష్టించాయి. చదువుకునేందుకు విస్తృతంగా పెరిగిన అవకాశాలు, మెరుగైన ఆరోగ్య సేవలు, విస్తరించిన ఆర్థిక సమ్మిళితత్వం, అందుబాటులోకి వచ్చిన ప్రాథమిక అవసరాలు..ఆర్థిక, సామాజిక కార్యక్రమాల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తృతం చేశాయి. అయినప్పటికీ.. సమాజంలో మహిళలు పోషిస్తున్న పాత్రకు అనుగుణంగా రాజకీయ రంగంలో, శాసనసభల్లో వారికి తగు ప్రాతినిధ్యం లభించలేదు. ఇది దురదృష్టకరం అని చెప్పుకోవాలి. దాదాపు 80 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం ఇప్పుడు ఈ కల సాకారం కాబోతున్నది. పరిపాలనలో, నిర్ణయాధికారంలో మహిళలు భాగస్వాములైతే.. వారిదైన ఆలోచనలనూ, అనుభవాలనూ జోడించడం ద్వారా ప్రజోపయోగ చర్చలు, పాలనా సామర్థ్యం మరింత మెరుగవు తాయనడంలో సందేహం లేదు. రిజర్వేషన్ల బల్లు ఆఆమోదం దక్కాక రానున్న అంటే... 2029లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికి మహిళా రిజర్వేషన్లను అమలుచేయడం ఇక అనివార్యం కానుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని అందించేందుకు గత ప్రభుత్వాలు కూడా దశాబ్దాలుగా తమవంతు ప్రయత్నం చేస్తూ వచ్చాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ... చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో విస్తృత ఏకాభిప్రాయం వ్యక్తం అయింది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధీనియంను పార్లమెంటు ఆమోదించింది. భారత చరిత్రలో ఇదో సువర్ణాధ్యాయంగా చెప్పుకోవాలి. మహిళలను శక్తివంతంగా ఎదగడానికి ఇదో ప్రయత్నంగా చూడాలి. వారికి సమున్నత గౌరవం ఇచ్చే చర్యగా భావించాలి. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ అవకాశం మన రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా చూడాలి. ఓ రకంగా ప్రపంచ దేశాలతో పోలిస్తే మనం ఎంతో ముందున్నామని చెప్పుకోవాలి. ఆచరణాత్మక రూపంలో సమానత్వానికి ప్రాతినిధ్యం ఉన్న సమాజాన్ని నిర్మించాలన్న మన రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రయత్నం నిజంగా అభినందించదగ్గదే. శాసనవ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడం అంటే వారిని మనం గౌరవించుకోవడమే. వారి శక్తిని దేశానికి ఉపయోగించడమే అవుతుంది. ఒక ఇంటిని ఎలా అయితే మహిళ నిర్మిస్తుందో, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రతి మహిళకు సమాన భాగస్వామ్యాన్ని అందించే సమాజాన్ని నిర్మించడంలో మనమంతా అవకాశం ఇవ్వాలి. నిజానికి ఇది ఎప్పుడో జరగాల్సిన సత్కార్యం. మహిళల ప్రాతినిధ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఇప్పటికే జాప్యం జరిగింది. శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల కిందటే గుర్తించినా అడుగు ముందుకు వేయలేదు. ఈ అంశంపై చర్చించారు తప్ప చట్టం చేయలేదు. జనాభాలో సగ భాగంగా ఉన్న వారి ఆకాంక్షలను మన శాసన వ్యవస్థలు ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు లభించే ఆమోదంలో విస్తృత ఏకాభిప్రాయం ముఖ్యం. ఇక్కడ శశభిషలకు తావు లేకుండా ఏకగ్రీవంగా పార్లమెంట్ దీనిని ఆమోదించి తీరాలి. జాతీయ ప్రయోజనాలే పరమావధి అన్న సంకల్పంతో ముందుకు సాగాలి. భారతీయ మహిళల కోసం చేపడుతున్న ఈ ముఖ్యమైన కార్యక్రమానికి మద్దతు అందించాల్సి బాధ్యత అన్న పార్టీలకు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో దేశాన్ని పట్టిపీడిస్తున్న కొన్న రుగ్మతలనైనా రూపుమాపేందుకు చర్చించాలి. దేశంలో వేళ్లూనుకు పోయిన కులవ్యవస్తపై చర్చంచాలి. కులాల వారీగా రిజర్వేషన్లు అనేవి ఉన్నా..కులాల ఉమ్మలాటలు ఆగడం లేదు. దేశ ప్రజలంతా సమానమే అన్న భావన రావాలంటే కుల వ్యవస్థను కూకటివేళ్లతో పెరికివేయాలి. ఈ విషయంపైనా ఇటీవల పలువురు ప్రముఖులు చర్చ లేవనెత్తారు. రాజకీయ పార్టీలు దూరదృష్టితో ఆలోచిస్తే..ఇదేమంత పెద్ద సమస్య కాబోదు.

## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

### ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
### గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా
### మీడియా సమావేశంలో జాగ్రుతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్ : కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగ్రుతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్ల దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమీషన్ల కోసమే ఇప్పుడు కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్టీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్‌ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్‌ఎండీఏకు ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# సురక్షిత ప్రసవం,
## ప్రసవానంతర చేయూతతో ఆరోగ్యకర రేపటి తరం !






**(11 ఏప్రిల్ "జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం" సందర్భంగా)**

**ఆడ జన్మకు సార్థకత అమ్మతనం. కళ్ల ముందు నడిచే దైవం అమ్మ. పునర్జన్మను పొందినమరో బిడ్డకు ప్రాణం పోసే అమ్మతనం మహిళలకు దేవుడిచ్చిన అపూర్వ అవకాశం. మాతృత్వం ఓ అద్భుత దైవకార్యంతో సమానం. అమ్మ కావడం స్త్రీకి తక్కిన అపురూప వరం. అత్యంత శక్తివంతమైన మాతృత్వం ఓ పరమ పవిత్ర కార్యం. ప్రాణాపాయం ఉంటుందని తెలిసి కూడా అమ్మతనమనే పేరును తెచ్చుకోవడానికి తాను గర్భిణిగా నవ మాసాలు బిడ్డను మోసి, ప్రసవ వేదనను సంతోషంగా భరించి, కేరు కేరను ఏడ్చే నవజాత శిశువు స్వరాన్ని వింటూ నొప్పులను మరిచి మురిసి పోతుంది అమ్మ అయిన అతివ.**

### 2026 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తం:

గర్భిణిగా, ప్రసవంలో, ప్రసవానంతరం కూడా తల్లికి సురక్షిత ఆరోగ్యాన్ని అందించడం మన కనీస బాధ్యత అని గమనించిన "వైట్ రిబ్బన్ అలియెన్స్" సంస్థ చొరవతో ప్రతి ఏట 11 ఏప్రిల్ రోజున భారత దేశవ్యాప్తంగా "జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం (నేషనల్ సేఫ్ మదర్‌హుడ్ డే)" నిర్వహించడం 2003 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రేమ, త్యాగం, అవధులు లేని ధైర్యం అనే విలువలను ఇంధనాలుగా మలిచి మహిళ మాతృత్వాన్ని అనుభవిస్తుంది. మహాత్మా గాంధీ సతీమణి కస్తూర్బ గాంధీ జన్మదినం 11 ఏప్రిల్‌ను పురస్కరించుకొని జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం పాటించుట జరుగుతున్నది. 2026 జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం ఇతివృత్తంగా "మాతృ సంబంధ ఆరోగ్య సురక్ష సమానత్వంలో ఏ తల్లిని వదల వద్దు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

### భారత్‌లో మాతాశిశు సంరక్షణ చర్యలు :

ప్రపంచ దేశాల్లో భారతీయ మహిళలు లేదా తల్లులు ప్రమాదకర వాతావరణాల్లో జీవితాలను గడుపుతున్నారని, ప్రపంచ గర్భిణి మహిళల మరణాల్లో 15 శాతం వరకు భారతంలోనే జరుగుతున్నట్లు తేలడం విచారకరం. సాలీనా 44,000 మంది మహిళలు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో లేదా ప్రసవానంతరం సరైన వైద్య సేవలు అందని కారణంగా మరణిస్తున్నట్లు తెలుస్తున్నది. మన దేశ గర్భిణులు, ప్రసవ సమయంలో లేదా ప్రసవం తర్వాత తల్లులు 12 శాతం వరకు మరణిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్త తల్లుల మరణాలు 99 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జరగడం గమనార్హం. 190 నుంచి 2015 వరకు 44 శాతం తల్లుల మరణాలు తగ్గడం, 2016 నుంచి 2030 వరకు ఒక లక్ష తల్లుల్లో 70 కన్న తక్కువ మరణాలు నమోదు అయ్యే విధంగా పలు కటుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. గ్రామీణ, పేద వర్గాలకు చెందిన మహిళలు అధికంగా ప్రమాదకర వాతావరణాల్లో బతుకులు ఈడ్చడం జరుగుతున్నది.

### మాతాశిశు సంక్షేమం ప్రభుత్వాల కనీస బాధ్యత :

గర్భిణులు, ప్రసవ సమయం, ప్రసవానంతరం తల్లి, బిడ్డ సురక్షకు నాణ్యమైన వైద్య ఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని తెలుసుకోవాలి. ఈ విధులకు సుశిక్షితులైన వైద్య సిబ్బందిని నియమించడం ప్రభుత్వాల కనీస కర్తవ్యం. మాతాశిశు సంక్షేమమే రేపటి ఆరోగ్యవంతమైన పౌర సమాజ స్థాపనకు పునాదులుగా తీసుకోవాలి. అమ్మతనం అమృత భావం. శిశువుకు తెలిసిన తొలి దైవం కన్న తల్లి మాత్రమే. ఇంట్లో కొలువైన అమాయక బాధ్యతగల ప్రేమ మూర్తి అమ్మ మాత్రమే. మాతృత్వం కోసం పరితపించే మహిళ నుంచి ప్రసవానంతర తల్లి వరకు అన్ని దశల్లో మాతృ శిశు ఆరోగ్యాన్ని బలపరచడం మన కనీస బాధ్యత.

అమ్మతనం పట్ల అవగాహన, తల్లులు లేదా గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రసవ సమయ సవాళ్లను అధిగమించడం, సురక్షిత ప్రసవం, ప్రసవానంతర చర్యలు తీసుకోవడం లాంటి అంశాలే కేంద్రంగా జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం కొనసాగాలి. అమ్మ లేని తనువు లేదు. అమ్మ ప్రేమకు తత్సమాన బంధం లేదు. అమ్మ ద్వేషించే బిడ్డ ఉండదు. తల్లి పాసు రుచి చూడని తనువు లేదు. అమ్మను ప్రసవ సమయంలో కోల్పోయిన బిడ్డలంత దురదృష్టవంతులు లేరు. అమ్మ మనసు వెన్నంట మృదువు. అమ్మ ప్రేమ కలుషితం కాని అనుభవం. మాతృత్వానికి తలవంచి, అమ్మకు పాదాభివందనం చేసి, నేటి భార్యను రేపటి తల్లిగా భావించి తగు జాగ్రత్తలు తీసుకుందాం. మాతాశిశు సంక్షేమానికి గొడుగు పడదాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## హరివంశ్ నారాయణ సింగ్‌కు
# మరో ఛాన్స్

### రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేసిన కేంద్రం
### మరోమారు డిప్యూటి ఛైర్మన్ అయ్యే అవకాశం

న్యూఢి : రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ కొనసాగే అవకాశముంది. అనుభవజ్ఞుడైన నాయకుడిగా, నిష్పక్షపాతంగా సభను నడిపించే సమర్థత కలిగిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. భారత పార్లమెంట్ ఎగువసభలో అత్యంత హుందాతనం గల నేతగా పేరుగాంచిన హరివంశ్.. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా కొనసాగబోతున్నారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనను నామినేట్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80 ప్రకారం.. సాహిత్యం, శాస్త్రం, కళలు, సామాజిక సేవ వంటి రంగాల్లో విశేష కృషి చేసిన 12 మందిని రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు. హరివంశ్ తనకున్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, సామాజిక స్పృహతో ఈ కోటాలో ఎంపికయ్యారు.



బిహార్ నుంచి జేడీయూ తరఫున ఎన్నికైన ఆయన సభ్యత్వ కాలం ఏప్రిల్ 9వ తేదీన ముగిసింది. సాధారణంగా పార్టీ కోటాలో సభ్యత్వం ముగిసిన తర్వాత తిరిగి పార్టీ టికెట్‌పైనే వస్తుంటారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆయన సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్రపతి కోటా ద్వారా నేరుగా సభకు పంపడం గమనార్హం. రాజ్యసభ 13వ డిప్యూటీ ఛైర్మన్‌గా ఆయన పనిచేసిన తీరు అమోఘం. క్లిష్టమైన బిల్లుల చర్చ సమయంలో సభలో గందరగోళం నెలకొన్నప్పుడు, ఆయన చూపిన ప్రతిభ, నిష్పక్షపాత నిర్ణయాలు అధికార, ప్రతిపక్షాల మన్ననలు పొందాయి. హరివంశ్ నారాయణ్ సింగ్‌ను మళ్లీ సభకు పంపడం వెనుక కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను రచించిన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎగువ సభలో ప్రతిపక్షాల బలం గణనీయంగా ఉన్నప్పుడు, సభను సమర్థవంతంగా నడపగలిగే వ్యక్తుల అవసరం ప్రభుత్వానికి ఉంటుంది. హరివంశ్ ఆ విషయంలో ఇప్పటికే తన సత్తా చాటారు. తాజా నామినేషన్‌తో ఆయన మళ్లీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేటెడ్ సభ్యుడిగా ఉంటూ ఈ బాధ్యతలు చేపడితే, అది సభకు మరింత గౌరవాన్ని తెస్తుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా హరివంశ్‌కున్న విలువలు, రాజకీయాలకు అతీతంగా ఆయనకు ఉన్న ఆదరణ ప్రభుత్వానికి సానుకూల అంశమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. రాజకీయాల్లో హుందాతనం తగ్గుతున్న కాలంలో, హరివంశ్ నారాయణ్ సింగ్ వంటి సీనియర్ల సేవలను వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామమని తెలిపారు. రంజన్ గొగొయ్ స్థానంలో ఓ అనుభవజ్ఞుడైన పార్లమెంటేరియన్ రావడం సభ గౌరవాన్ని మరింత పెంచుతుందనడంలో సందేహం లేదని పేర్కొన్నారు. హరివంశ్ నారాయణ్ సింగ్ మళ్లీ డిప్యూటీ ఛైర్మన్ బాధ్యతలు చేపడితే.. సభలో చర్చల నాణ్యత మరింత మెరుగుపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పార్లమెంట్ చరిత్రలో సరికొత్త అధ్యాయం

**ఏప్రిల్ 6, 2026న సుప్రీం కోర్టు ప్రముఖ మహిళా న్యాయవాది డాక్టర్ మేనకా గురుస్వామి రాజ్యసభ ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయడంతో భారత పార్లమెంటరీ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక ఎల్ జి బి టి క్యు ప్లస్ (LGBTQ+) (క్వీర్) వర్గానికి చెందిన మహిళ, పశ్చిమ బెంగాల్ నుంచి తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) తరపున పెద్దల సభ (రాజ్యసభ)లో అడుగు పెట్టారు.**




టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆమెను పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు నామినేట్ చేసి దేశ వ్యాప్తంగా అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఎల్జిబిటిక్యు ప్లస్ వర్గానికి చట్ట సభలలో సరైన ప్రాతినిధ్యం లభించడం లేదన్న వాదనల నేపథ్యంలో మేనకా గురుస్వామి రాజ్యసభ ఎంపీగా ఎన్నిక కావడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

డా మేనకా గురుస్వామి నేపథ్యం:
2018లో స్వలింగ సంపర్కం నేరం కాదు అంటూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పులో కీలక వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది డా మేనక గురుస్వామి కావడం విశేషం. 1974లో హైదరాబాద్‌లో జన్మించిన ఆమె దేశంలోని ప్రఖ్యాత న్యాయ విశ్వవిద్యాలయం (లా యూనివర్సిటీ) నల్సార్ సహా ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ యూనివర్సిటీల నుండి న్యాయశాస్త్రంలో పట్టాలు పొందారు. కొలంబియా యూనివర్సిటీలో బీఆర్ అంబేద్కర్ రీసెర్చ్ స్కాలర్‌గా కూడా పనిచేసిన ఆమె ఐక్యరాజ్యసమితికి సంబంధించిన అనేక న్యాయపరమైన వ్యవహారాలను కూడా పర్యవేక్షించారు. భారత శిక్షా స్మృతిలోని సెక్షన్ 377లోని కొంత భాగాన్ని రద్దు చేయడం ద్వారా, భారత సుప్రీం కోర్టు 2018 సెప్టెంబర్ 6న స్వలింగ సంపర్కాన్ని అధికారికంగా నేరరహితం చేసింది. "అసహజ నేరాలను" నేరంగా పరిగణించిన వలస పాలన నాటి ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, అహేతుకమని, అలాగే గోప్యత, గౌరవం మరియు సమానత్వానికి సంబంధించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదని ఈ ఏకగ్రీవ తీర్పు ప్రకటించింది. ఈ కేసు సందర్భంలో మేనకా గురుస్వామి సుప్రీం కోర్టులో కీలక వాదనలు వినిపించారు. ఆ తర్వాత "టైమ్స్ మ్యాగజైన్" ప్రకటించిన ప్రపంచంలోని 100 మంది అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల జాబితాలో ఆమెకు చోటు దక్కడం గమనార్హం. ఆమె కేవలం హక్కుల కార్యకర్త మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సీనియర్ న్యాయవాది. ఆమె తన భాగస్వామి, మరో సుప్రీంకోర్టు న్యాయవాది అయిన అరుంధతి కట్జూతో సహజీవనం చేస్తున్నారు. ఈ జంట ఎన్నో ముఖ్యమైన కేసులను వాదించడం విశేషం.

ఉన్నత విద్యావంతురాలైన మేనకా గురుస్వామి కేవలం న్యాయవాద వృత్తికి మాత్రమే పరిమితం కాలేదు. ఆమె తన ఉనికిని రాజకీయాలకు విస్తరిస్తూ టీఎంసీకి సంబంధించిన అనేక న్యాయ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. 2025 సంవత్సరం చివర మరియు 2026 సంవత్సరం ఆరంభంలో, పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ తో సంబంధం ఉన్న వ్యక్తులు మరియు సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) పలు సోదాలు నిర్వహించింది. మనీ లాండరింగ్, అవినీతి మరియు వివిధ కుంభకోణాలకు సంబంధించిన నిధుల మళ్లింపు ఆరోపణలపై ఈ సోదాలు ప్రధానంగా సోదాలు నిర్వహించింది. ఈ దాడుల సమయంలో టీఎంసీ తరపున డా మేనకా గురుస్వామి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. ఇవే కాకుండా, పరిపాలనా సంస్కరణలు, రైట్ టు ఎడ్యుకేషన్, సాల్వాజుడుం వంటి ఎన్నో సంచలనాత్మక కేసులలో కూడా ఆమె తన వాదనలు వినిపించారు.

చట్టసభలలో ప్రాతినిధ్యం:
వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి, సామాజిక సేవకులకు పెద్దల సభ ప్రసిద్ధి చెందింది. ఇప్పటివరకు వైద్య, విద్యా, కళా రంగాలకు చెందిన ఎంతోమందికి రాజ్యసభలో స్థానం దక్కింది. అయితే, దేశ పార్లమెంటరీ చరిత్రలోనే ఎల్జిబిటిక్యు ప్లస్ క్వీర్ వర్గానికి తొలిసారిగా డా మేనకా గురుస్వామి ప్రాతినిధ్యం వహించడం ఓ సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది. 2021 ఎన్నికలలో పశ్చిమ బెంగాల్ లో ప్రస్తుతం అధికారంలో ఉన్న మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ దాదాపు 42.50 లక్షల భారీ ఓట్ల తేడాతో విజయం సాధించగా, 2026 ఏప్రిల్ 23 నుండి 29 వరకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దొంగ ఓట్ల ప్రక్షాళన కోసం ఓటర్ల జాబితా సవరింపు (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్) ప్రక్రియను చేపట్టి 91 మంది ఓటర్లను తొలగించడంతో అధికార పార్టీకి విజయావకాశాలు తగ్గినట్లు పలువురు భావిస్తున్నారు. ఈ వాదన తెరపైకి వస్తున్న తరుణంలో తృణమూల్ కాంగ్రెస్ అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తుంది అనే భావనను ప్రజాబాహుళ్యంలోకి తీసుకువెళ్ళేలా అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎల్జిబిటిక్యు ప్లస్ క్వీర్ వర్గానికి చెందిన డా మేనకా గురుస్వామిని రాజ్యసభకు నామినేట్ చేస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎవరూ ఊహించని విధంగా స్వలింగ సంపర్కురాలైన (హోమోసెక్సువల్) మేనకా గురుస్వామిని టీఎంసీ తరపున రాజ్యసభకు పంపి మమతా బెనర్జీ అందరినీ ఆశ్చర్యపరిచారు. తమ పార్టీ అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తుంది అనే బలమైన సందేశాన్ని మమతా బెనర్జీ ఈ నామినేషన్ ద్వారా దేశానికి ఇచ్చారు. డా మేనకా గురుస్వామి రాజ్యసభలో కాలుమోపడంతో ఎంతోకాలంగా వివక్ష ఎదుర్కొంటున్న ఎల్జిబిటిక్యు ప్లస్ క్వీర్ వర్గానికి తమ వాణిని ఇప్పుడు పార్లమెంట్‌లో వినిపించే అవకాశం కలిగింది.

ఎల్జిబిటిక్యు ప్లస్ గుర్తింపు:
2025 సంవత్సరం ఆరంభం నాటికి, ప్రపంచంలోని 38 దేశాలు స్వలింగ వివాహాలను చట్టబద్ధంగా గుర్తించాయి. 130కి పైగా దేశాలు స్వలింగ లైంగిక చర్యలను చట్టబద్ధం చేసినప్పటికీ, ఎల్జిబిటిక్యు ప్లస్ హక్కులకు (వివాహం, సంబంధాలు, మరియు వివక్ష వ్యతిరేక రక్షణ, వగైరా) చట్టపరమైన గుర్తింపు ప్రధానంగా యూరప్, అమెరికా, మరియు ఓషియానియాలోని కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉంది. జనవరి 2025 నాటికి, ప్రపంచంలోని 38 దేశాలు స్వలింగ జంటలు వివాహం చేసుకోవడానికి చట్టబద్ధంగా అనుమతిస్తున్నాయి. వివాహానికి బదులుగా, కొన్ని దేశాలు ప్రత్యామ్నాయ చట్టపరమైన గుర్తింపు (ఉదాహరణకు, సివిల్ యూనియన్లు, డొమెస్టిక్ పార్టనర్‌షిప్‌లు) అవకాశాలు కల్పిస్తున్నాయి. లైంగిక ధోరణి ఆధారంగా వివక్షకు వ్యతిరేకంగా చట్టపరమైన రక్షణ విస్తృతంగా మారుతూ ఉంటుంది. కేవలం 11 దేశాలు మాత్రమే తమ రాజ్యాంగంలోని వివక్ష వ్యతిరేక నిబంధనలలో దీనిని స్పష్టంగా పేర్కొన్నాయి. స్వీయ-నిర్ణయం ఆధారంగా పూర్తి చట్టపరమైన లింగ గుర్తింపు కేవలం 12 దేశాలలో మాత్రమే అందుబాటులో ఉండగా వాటిలో 8 మాత్రమే ట్రాన్స్ పేరెంట్‌హుడ్‌ను పూర్తిగా గుర్తిస్తున్నాయి. మరో పక్క కనీసం 67 దేశాలు ఇప్పటికీ పరస్పర అంగీకారంతో కూడిన వయోజనుల మధ్య స్వలింగ సంబంధాలను నేరంగా పరిగణిస్తున్నాయి. వివిధ దేశాలలో చట్టపరమైన పరిస్థితి వేగంగా మారుతోంది. కొన్ని దేశాలలో హక్కుల విషయంలో పురోగతి సాధిస్తుండగా, మరికొన్ని దేశాలలో పెరుగుతున్న ఆంక్షలు మరియు ఎల్జిబిటిక్యు ప్లస్ వ్యతిరేక చట్టాలు కొనసాగుతున్నాయి.

ఎల్జిబిటిక్యు ప్లస్ క్వీర్ వర్గానికి ఏమిటి లాభం?
చట్ట సభలో డాక్టర్ మేనక ప్రవేశం ఎల్జిబిటిక్యు ప్లస్ క్వీర్ వర్గానికి నిర్మాణాత్మక మరియు ప్రతీకాత్మక ప్రయోజనాలను చేకూరుస్తుందని, హక్కుల కోసం వారు జరిపే పోరాటం కోర్టు వాదనల నుండి శాసనపరమైన చర్యల ద్వారా చట్టాల రూపకల్పనకు మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు.

**యేచన్ చంద్ర శేఖర్**
**మాజీ రాష్ట్ర కార్యదర్శి**
**ది భారత్ స్కౌట్స్ & గైడ్స్, తెలంగాణ**
**హైదరాబాద్**
**8885050822**



# ఎండలు దంచి కొడుతున్నయ్

ఎండాకాలం మొదలైంది. ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలకంటే ఎక్కువగా నమోదు అవుతున్నాయి. పది దాటిందంటే చాలా హీట్ పెరిగిపోతుంది. గత వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న ఎండలు..రాబోయే రోజుల్లో మరింత పెరగనున్నట్లు వాతావారణ శాఖ హెచ్చరిస్తోంది. వారం నుంచే రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అప్పుడే భానుడి తాకిడికి జనం విల విల్లాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి వాతావరణంలో సాధారణానికి మించిన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సాయంత్రం 5 గంటలు దాటిన ఎండ తగ్గనంటోంది. ఇప్పుడే గరిష్ట డిగ్రీలకు చేరుకుంటున్న ఎండలు రాబోయే రోజుల్లో ఎలా ఉంటాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. ఈ వేసవిలోనూ ఎండలు మండుతాయని అత్యధిక డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ స్పష్టంచేసింది.

– జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం)



### భగ్గుమంటున్న భానుడు
### పగలు వేడి..రాత్రి చలి
### పెరుగుతున్న టెంపరేచర్
### బయటకెళ్లాలంటే జంకుతున్న జనం



#### పగటి పూట వేడి..రాత్రి చలి

పగలు వేడి, రాత్రి చలితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రకృతిలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో పగటి పూట ఎండవేడిమి ఉష్ణోగ్రతలు పెరిగి ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా రాత్రి వేళల్లో మాత్రం వాతావరణం చల్లబడి చలి ఉంటోంది. దీంతో ప్రజలు రాత్రి చలితో పగటి పూట ఎండకు ఇబ్బందులు పడుతున్నారు.

#### రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఇప్పటికే ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. వచ్చే రోజుల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 34 డిగ్రీల సెల్సియస్ తో ఎండ తీవ్రత పెరుగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారు. పొద్దున్నుంచే ఎండకు తోడు ఉక్కపోత ఎక్కువవుతుండడంతో ఆగమవుతున్నారు. పశువులు, గొర్రెల కాపరులు ఎండవేడిమికి నీడను వెతుక్కుంటున్నారు. ప్రజలు రోడ్ల వెంట నడవాలంటే జంకుతున్నారు. ఉదయం నుంచే సూరీడు భగ్గుమనడంతో వృద్ధులు నీడను వీడడం లేదు.

#### జాగ్రత్తలు తీసుకోవాలి
**డాక్టర్ మధుసూదన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జయశంకర్ భూపాలపల్లి**



ఈసారి ముందు నుంచే ఎండల ప్రభావం అధికంగా ఉండే అవాకాశాలున్నాయి. సాధ్యమైనంత వరకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. భోజన పదార్థాల్లో ఉప్పు, కారం, నూనె పదార్థాలు, మాంసాహారాలు తగ్గించడంతో పాటు మజ్జిగ వాడాలి. సాధ్యమైనంత వరకు ఎండలో తిరగవద్దు. శరీరానికి చలువ చేసే కాటన్ దుస్తులు, తెల్లరంగు బట్టలు ధరించాలి. టోపీ, చలువ కళ్లద్దాలు గానీ, తలపై గుడ్డ గాని ధరించాలి. శరీరంలో నీటి శాతం తగ్గకుండా కొబ్బరినీళ్లు, పళ్లరసాలు తరుచుగా తాగాలి. రోజుకు కనీసం 6 నుంచి 8 లీటర్ల నీరు తాగేందుకు ప్రయత్నించాలి. ఎండలో తిరిగి ఇంట్లోకి రాగానే వెంటనే నీరు తాగొద్దు. కాసేపు సేద తీరాక నీటిని తీసుకోవాలి. కళ్లు తిరిగినట్లు అనిపించినా, స్పృహ కోల్పోతున్నట్లు అనిపించినా వెంటనే నీడ ఉన్న ప్రదేశంలోకి వెళ్లాలి. తప్పని సరిగా ఎండలో ప్రయాణించాల్సి వస్తే వేడిగాలి లోపలికి వెళ్లకుండా ముక్కు మూతికి శుభ్రమైన గుడ్డ కట్టుకోవాలి.

#### బీ అలెర్ట్

3, 4 రోజులు ఎండలు దంచికొడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉష్ణోగ్రతలు 2నుంచి 3 డిగ్రీల వరకుపెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా మధ్నాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు భారీగా పెరగనున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 37 నుంచి 40 డిగ్రీల వరకు టెంపరేచర్ నమోదయ్యే అవకాశం ఉంది. ఈ ఎండా కాలంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. వడదెబ్బకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. బయటికెళ్లేటప్పుడు నీళ్లు, చల్లని ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపింది.



#### ఉదయం 11 తర్వాత బయటికి వద్దు

ఉదయం 11 గంటల తర్వాత చిన్న పిల్లలు, వృద్ధులు, గుండెజబ్బులు, ఆస్తమా , మానసిక సమస్యలు ఉన్న వారు బయటికి వెళ్లొద్దని డాక్టర్లు సలహా ఇస్తున్నారు. ఎవైనా పనులుంటే ఉదయం 11గంటలలోపు.. సాయంత్రం 4 గంటల తర్వాత చేసుకోవాలంటున్నారు. హై టెంపరేచర్, వీక్నెస్, హెడెక్, తీవ్రమైన దాహం, చెమటలు రాకపోవడం, చర్మం ఎర్రగా మారడం, శ్వాస సమస్యలు, హార్ట్ బీట్ పెరగడం, వికారం, వాంతులు, మూర్ఛ వంటి అనారోగ్య సమస్యలుంటే వడ దెబ్బ అని గ్రహించి ఆస్పత్రికి వెళ్లాలని కోరుతున్నారు.



# పేద ప్రజల ప్రాణాలు కాపాడడమే ప్రభుత్వ లక్ష్యం..

### వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ,



**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 10 (నినాదం) మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎమర్జెన్సీ సమయాల్లో అత్యవసర వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ సెంటర్లను రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పడం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.**

శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఆవరణలో 23 కోట్ల 75 లక్షల రూపాయల వ్యయంతో 50 బెడ్ల సామర్థ్యంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ అత్యవసర సేవల విభాగాన్ని, తెలకపల్లి మండల కేంద్రంలో1కోటి 59 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రాష్ట్ర ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తూ, కమిషనర్ సృజన, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, తో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ..

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినా, హార్ట్ స్ట్రోక్ వచ్చినా, విష జ్వరాలు ప్రబలినా ఇకపై హైదరాబాద్ కు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా ఉండేందుకే నాగర్ కర్నూల్ జిల్లా లాంటి మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య సంరక్షణా అధిక ప్రాధాన్యత ఇచ్చి క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా అత్యవసర సేవల విభాగాలను ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు.

నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలకు తమ సొంత







జిల్లాల్లోనే కార్పొరేట్ స్థాయి ఎమర్జెన్సీ వైద్యం అందించేందుకు క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ)లను అందుబాటులోకి తేవడంతో ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంత ప్రాముఖ్యత ఇస్తుందో ప్రతి ఒక్కరు గ్రహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ మరియు దూర ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు చెప్పారు.

అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల మరియు నర్సుల ఖాళీలను భర్తీ చేయడానికి భారీ స్థాయిలో నియామకాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. ప్రతి పేద కుటుంబానికి అందుబాటులో, నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన అన్నారు.అత్యవసర వైద్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అంబులెన్స్ సేవలను విస్తరించడం, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయడం జరుగుతోందని మంత్రి వివరించారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని, అందుకే వైద్య రంగంలో సంస్కరణలను దశలవారీగా అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పేద ప్రజలకు మంచి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 43 వేల పడకలు (బెడ్లు) సిద్ధంగా ఉన్నాయన్నారు.

రాష్ట్రంలోని 35 వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు.

విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హాస్టల్ వసతులు, లైబ్రరీలు, ల్యాబొరేటరీలను అభివృద్ధి చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, భవిష్యత్తులో మెడికల్ ఎడ్యుకేషన్ మరింత నాణ్యతతో, ఉన్నత స్థాయికి చేరుకుంటుందని, తద్వారా రాష్ట్రంలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వసతులను మెరుగుపరచడం జరుగుతుందని మంత్రి తెలిపారు.నాగర్ కర్నూలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మెడికల్ మసతుల కల్పనకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు కోట్ల అరవై ఐదు లక్షల రూపాయలు అందుబాటులో ఉంచడం జరిగిందని, అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు నేరుగా కలెక్టర్ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి మెడికల్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో విద్యార్థులు విద్యా సౌకర్యాలు, హాస్టల్ వసతులు, క్లినికల్ ట్రైనింగ్, స్టైపెండ్లు వంటి అంశాలపై తమ అభిప్రాయాలు, సమస్యలను వెల్లడించారు. మంత్రి వాటిని శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు.

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.

జిల్లా ఆసుపత్రిని 550 పడకల సామర్థ్యానికి అభివృద్ధి చేసి నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రి మరియు మెడికల్ కళాశాల అభివృద్ధి జరుగుతున్నందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నేడు జిల్లా కేంద్రంలో 23 కోట్ల 75 లక్షల రూపాయలతో క్రిటికల్ కేర్ బ్లాక్ ను ప్రారంభం చేయడం నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి మూలికవస్తులు సిబ్బంది డాక్టర్లు వసతులను మెరుగుపరుస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. నాగర్ కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోజువారి సేవలపై ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి కూడా పరిస్థితిని సమీక్షించి, అవసరమైన సిబ్బంది నియామకం, సదుపాయాల మెరుగుదలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర మున్సిపల్ వైస్ చైర్మన్ బాదాం రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, డీఎంహెచ్వో రవి నాయక్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు, అధికారులు, వివిధ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ కుబేరుల జాబితాలో అంబానీ ఏ స్థానంలో ఉన్నారో తెలుసా..?
## ఆయన సంపద ఎంత?

నినాదం మార్కెట్

భారతదేశంలోని బిలియనీర్ల విషయానికి వస్తే మనకు మొదటగా గుర్తొచ్చే పేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, డైరెక్టర్ అయిన ముఖేష్ అంబానీ.

భారతదేశంలో సంపద విషయంలో ఆయనకు సాటిలేరు. కానీ ప్రపంచవ్యాప్తంగా ముఖేష్ అంబానీ ఏ స్థానంలో ఉన్నారో మీకు తెలుసా? ప్రస్తుత (ఏప్రిల్ 2026) గణాంకాల ప్రకారం.. ముఖేష్ అంబానీ ప్రపంచ ధనవంతుల జాబితాలో తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల ఆయన ర్యాంకింగ్ మారుతూ ఉన్నప్పటికీ, తాజాగా ఆయన 20వ స్థానంలో కొనసాగుతున్నారు.

ఫోర్బ్స్ రియల్ టైమ్ జాబితా ప్రకారం..

మొత్తం ఆస్తి విలువ: సుమారు వ99.7 బిలియన్ల నుండి వ100 బిలియన్లు (భారతీయ కరెన్సీలో సుమారు రూ.9.8 లక్షల కోట్లు).

ఆసియాలో స్థానం: ముఖేష్ అంబానీ ఇప్పటికీ భారతదేశం, ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా మొదటి స్థానంలో కొనసాగుతున్నారు.

వ్యాపార సామ్రాజ్యం: అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ దాదాపు వ125 బిలియన్ల వార్షిక ఆదాయాన్ని కలిగి ఉంది. ఇది పెట్రోకెమికల్స్, ఆయిల్, గ్యాస్, టెలికాం



(జియో), రిటైల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాల్లో విస్తరించి ఉంది.

జియో నెట్‌వర్క్ ప్రస్తుతం 50 కోట్లకు పైగా వినియోగదారులను కలిగి ఉంది. 2026లో ఈ కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసే ప్లాన్ ఉంది. 2023లో ఆయన ముగ్గురు పిల్లలు – – ఆకాష్ (జియో), ఈషా (రిటైల్, ఫైనాన్షియల్), అనంత్ (ఎనర్జీ) రిలయన్స్ బోర్డులో చేరారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో అంబానీ రిలయన్స్ వ్యాపారాన్ని కూడా విస్తరించారు. ఈ సంస్థ రాబోయే పదేళ్లలో పునరుత్పాదక ఇంధన రంగంలో 80 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. అదనంగా, ఈ సంస్థ తన రిఫైనరీ సమీపంలో ఒక కొత్త కాంప్లెక్స్‌ను నిర్మించనుంది.

ప్రపంచంలోని టాప్ 10 కుబేరులు (ప్రస్తుత జాబితాలో):

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉన్న మరికొందరు ప్రముఖులు:

ఎలోన్ మస్క్
లారీ పేజ్
జెఫ్ బెజోస్
మార్క్ జుకర్‌బర్గ్
సెర్గీ బ్రిన్
లారీ ఎల్లిసన్
బెర్నార్డ్ ఆర్నాల్ట్
జెన్సన్ హువాంగ్
వారెన్ బఫెట్
మైఖేల్ డెల్

స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు మారిన ప్రతిసారీ అంబానీ ఆస్తి విలువ, ర్యాంకింగ్‌లో మార్పులు సహజం. అయితే, భారతీయ కుబేరుల జాబితాలో మాత్రం ఆయన సుదీర్ఘ కాలంగా అగ్రస్థానంలోనే కొనసాగుతున్నారు. రిలయన్స్‌ను ఆయన తండ్రి ధీరూభాయ్ అంబానీ 1966లో ఒక చిన్న వస్త్ర వ్యాపారంగా ప్రారంభించారు. 2002లో ఆయన తండ్రి మరణానంతరం, అంబానీ, ఆయన తమ్ముడు అనిల్, కుటుంబ వ్యాపారాన్ని తమ మధ్య పంచుకున్నారు.

### పైన పటారం.. లోన లొటారం?
# అవార్డుల మెరుపులు – క్షేత్రస్థాయి మరకలు!

**ప్రభుత్వ యంత్రాంగంలో పనితీరుకు కొలమానంగా నిలవాల్సిన జాతీయ అవార్డులు, నేడు కేవలం గణాంకాల గారడీగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. “పైన పటారం.. లోన లొటారం” అన్న చందంగా, కాగితంపై అభివృద్ధిని చూపి జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందుతున్న జిల్లా స్థాయి అధికారుల తీరుపై ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది విడుదల చేసే ‘స్వచ్ఛ సర్వేక్షణ్’, ‘నీతి ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్స్’ వంటి నివేదికలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు రికార్డులు చెబుతున్నా, వాస్తవానికి ఆయా జిల్లాల్లోని సామాన్య ప్రజల జీవన ప్రమాణాల్లో ఆశించిన మార్పు రావడం లేదు. గత ఆర్థిక సంవత్సరంలో పారిశుధ్య నిర్వహణలో జాతీయ అవార్డులు అందుకున్న కొన్ని గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీలలో నేటికీ బహిరంగ మల విసర్జన పద్ధతులు, అధ్వాన్నమైన డ్రైనేజీ వ్యవస్థ కొనసాగుతుండటం గమనార్హం.**

#### డాక్యుమెంటేషన్ మాయాజాలం

జాతీయ అవార్డుల ఎంపిక ప్రక్రియలో క్షేత్రస్థాయి పరిశీలన కంటే, అధికారులు సమర్పించే డిజిటల్ రిపోర్టులే కీలక పాత్ర పోషిస్తున్నాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన తాజా పనితీరు ఆడిట్ నివేదికల్లో పలుమార్లు హెచ్చరించినట్లుగా, “నిధుల వినియోగం కాగితాలపై జరిగినట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఆస్తుల సృష్టి లోపభూయిష్టంగా ఉంది.” 2023–24 గణాంకాల ప్రకారం, జల జీవన్ మిషన్ కింద వంద శాతం ఇంటింటికీ కుళాయిలు ఇచ్చామని ప్రకటించిన కొన్ని జిల్లాల్లో, సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం 30 నుండి 40 శాతం గ్రామాల్లో నీటి సరఫరా క్రమబద్ధంగా లేదు. అవార్డుల కోసం చేసే ‘డాక్యుమెంటేషన్’ కోసం లక్షలాది రూపాయల ప్రజా ధనాన్ని ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చెల్లిస్తూ, కేవలం అంకెలను మేనేజ్ చేయడం ద్వారా వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్నారనేది కాదనలేని సత్యం.

#### వ్యవస్థాగత సవాళ్లు – అధికారుల ఆత్మరక్షణ

విమర్శలను విశ్లేషించేటప్పుడు అధికారుల పక్షాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవడం సమంజసం. జిల్లా యంత్రాంగం ఎదుర్కొంటున్న సిబ్బంది కొరత, రాజకీయ ఒత్తిళ్లు, నిధుల విడుదలలో జాప్యం వంటి సవాళ్లు క్షేత్రస్థాయి అమలును ప్రభావితం చేస్తున్నాయి. అధికారులు తమ వాదనలో.. జాతీయ స్థాయి పోటీ అనేది జిల్లా యంత్రాంగంలో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి ఇది ఒక ప్రేరణగా పనిచేస్తుందని పేర్కొంటున్నారు. ఒకటి రెండు లోపాలను చూపి మొత్తం వ్యవస్థను తప్పు పట్టడం సరికాదని, గ్రామీణ స్థాయిలో ప్రజల సహకారం కూడా అభివృద్ధిలో కీలకమని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే, సమర్థనలు బాధ్యత నుండి తప్పించుకోవడానికి సాకులుగా మారకూడదు. అవార్డులు అనేవి పనికి ప్రోత్సాహకాలుగా ఉండాలే తప్ప, అసంపూర్తి పనులకు ముసుగులుగా మారకూడదన్నదే సామాజిక కార్యకర్తల ప్రధాన డిమాండ్.

#### ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష

ప్రజాస్వామ్యంలో ఏ పురస్కారానికైనా అసలైన విలువ సామాన్యుడి సంతృప్తిలోనే ఉంటుంది. అవార్డుల కోసం పాకులాడే అధికారులు, తమ జిల్లాలో సామాన్యుడు ఎదుర్కొంటున్న ప్రాథమిక సమస్యలపై దృష్టి సారించినప్పుడే ఆ గౌరవానికి సార్థకత లభిస్తుంది. 2026 నాటికి భారత పాలనా వ్యవస్థలో ‘డిజిటల్ ట్రాన్స్‌పరెన్సీ’ని మరింత పటిష్టం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో, ఇటువంటి డొల్లతనం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. కేవలం ప్రదర్శన కోసం కాకుండా, ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా చూడటం అధికారుల నైతిక బాధ్యత. పతకాలు మెడలో మెరిసినప్పుడు కాదు, ప్రజల కళ్లలో ఆనందం చూసినప్పుడు మాత్రమే అది నిజమైన విజయం అని యంత్రాంగం గుర్తించాలి.



–ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170

## అర్హులకు ఎల్‌ఓసి పత్రాలు అందజేత



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు అనారోగ్యం బారిన పడి నిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. అనారోగ్య బాధితులకు చికిత్సకు కావలసిన డబ్బులు చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ను కలిసి పరిస్థితులు వివరించారు. స్పందించిన కోనా శ్రీశైలం గౌడ్ ఇన్చార్జి మంత్రి ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి పథకము ద్వారా చికిత్సకు కావలసిన ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో మంజూరైన ఎల్‌ఓసి పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ అందజేశారు. వారిలో ఎన్ ఎల్ బి నగర్ కి చెందిన కిషోర్ కుమార్ కు 2.50 లక్షలు, యాస్మిన్ బేగం,వక్క సునీత, అడక్కని సోని, జెషిత కు 2 లక్షల రూపాయల సీఎంఆర్ చెక్కులను మొత్తంగా నాలుగు లక్షల యాభైవేల (4.50) రూపాయల విలువైన సిఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద, మధ్యతరగతి నిరుపేద ప్రజలకు ఆర్థిక అవసరాన్ని తీర్చే ఒక గొప్ప కార్యక్రమం అని తెలియజేశారు. నియోజకవర్గం పరిధిలో నిరుపేదలు అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్నట్లయితే వాటికి సంబంధించిన రసీదులను తమ కార్యాలయంలో అందజేసి ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాలు అర్హులందరికీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను విజయవంతం చేయండి



**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 10 (నినాదం):** ఏప్రిల్ 11వ తేదీన నిర్వహించనున్న సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించి, విజయవంతం చేయాలని ఎం.బి.సి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రామ్ జోషి హన్మంతు పిలుపునిచ్చారు. ?శుక్రవారం స్థానిక ఐబీలో ఈ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని పలువురు ప్రముఖులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్ జోషి హన్మంతు మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, కుల వివక్షపై పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని జయంతిని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ కూన సంతోష్, సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కశపాగ ఇమ్మయ్య, దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు తలారి యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టు దేవదాసు, చంద్రశేఖర్, మునిపల్లి ఆనంద్, ఎర్రారం దేవదాసు తదితరులు పాల్గొని కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

**చిలుక ఉపేందర్ రెడ్డి**

**ఎల్ బినగర్, ఏప్రిల్ 10 (నినాదం):** పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో "ప్రజా పాలన – పట్టణ ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా కాలనీలోని రోడ్లపై చెత్తను తొలగిస్తూ , ఆరు బయట వ్యర్థాలను వేయవద్దన్ని సరూర్ నగర్ ఉప కమిషనర్ శ్రీనివాస్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, డిఈ చందన, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఏలిమినేటి సంజీవరెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అనేది ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి అత్యంత అవశ్యకం. ఈగలు, దోమల నివారణకు, వ్యాధుల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మధుసూదన్, మల్లేశ్వర్ యాదవ్, మహిపాల్ రెడ్డి, సుబ్బారావు, పున్న కృష్ణయ్య, ఆనంద్ రావు, నవనీత్, సోమ శేఖర్, కాంగ్రెస్ నాయకులు పెద్దవూర సైదులు, వెంకట రమణ రెడ్డి(రాజు), పగడాల ఏల్లన్న, రఘువర్ధన్ రెడ్డి, గణేష్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ బుచ్చయ్య, కీర్తన, అశోక్, శ్రీకాంత్, దాసరి వెంకటేష్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# యోగా సాధనతో శారీరక ఆరోగ్యం

**ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**రంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 10 (నినాదం) :**యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో హెల్త్ వీక్ లో భాగంగా శనివారం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన యోగా దినోత్సవం కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రహదారులు మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా ప్రజలు నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా సాధన ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని నిత్యజీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి జీవన శైలి సంబంధిత వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడం వల్ల వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమని కలెక్టర్ బి.నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ మెడికల్ , హెల్త్ క్రిస్టినా చోగ్తూ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి, హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా హయత్, డాక్టర్ పూనం, డిపిఓ అక్రమ్, అధికారులు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు నిత్య జీవితంలో భాగం కావాలి





**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**భానూరులో ఘనంగా ప్రారంభమైన టంగుటూరి అంజయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్**

**పటాన్చెరు, ఏప్రిల్ 10(నినాదం):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి నిత్య జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై..ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని పేద, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత నేత టంగుటూరి అంజయ్య అని కొనియాడారు. అంతటి గొప్ప వ్యక్తిని స్మరిస్తూ కిడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి. వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడా పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల కొరకు కార్మిక భవన్ ఏర్పాటుకు సహకరిస్తా..

**కార్మిక భవన నిర్మాణానికి వజ్రేశ్ యాదవ్ సానుకూలత**



**జవహర్‌నగర్, ఏప్రిల్ 10 (నినాదం):** జవహర్ నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల కొరకు కార్మిక భవన్ ఏర్పాటుకు సహకరిస్తానని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను జవహర్‌నగర్ డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ వారితో మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రత్యేకంగా లేబర్ అడ్డా' స్థలం కేటాయించాలని అక్కడ భవన నిర్మాణానికి సహకరించాలని వారు వినతిపత్రం అందజేశారు.కార్మికుల విజ్ఞప్తిపై వజ్రేశ్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, కార్మికుల సమస్యలను వివరించారు. త్వరలోనే అధికారులతో క్షేత్రస్థాయిలో సమావేశమై, భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ మరియు ఇతర అనుమతులు లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ , ప్రతినిధులు అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, గౌరవ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్ సభ్యులు సలహాదారులు రమణ రెడ్డి, మల్లేష్ (ఏ ఐ ఎఫ్ టీ యూ, కోశాధికారి కోట్ల చెన్నా రెడ్డి, మరాఠి బాబు, ఐలయ్య పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.కార్మికుల సంక్షేమానికి తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా వజ్రేశ్ యాదవ్ వారితో స్పష్టం చేశారు.

## నియోజకవర్గ అభివృద్ధే ఏకైక లక్ష్యం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- ఎల్బీనగర్‌లో నూతన ఫాగింగ్ యంత్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఎల్ బినగర్, ఏప్రిల్ 10 (నినాదం):** నియోజకవర్గ అభివృద్ధి తన ఏకైక లక్ష్యం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో నూతన పాగింగ్ యంత్రాలను జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, పలువురు డిప్యూటీ కమీషనర్లు,ఎంటమాలజీ సిబ్బంది తో కలిసి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా నియోజకవర్గ ప్రజలు దోమల వల్ల అనేక ఇబ్బందులు గురవుతున్నారని గుర్తించి దోమల పై యుద్ధం అనే నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దానిలో భాగంగా నా పిలుపు మేరకు అభిమానులు తమ,తమ స్వంత నిధులతో ఫాగింగ్ యంత్రాలు కొనుగోలు చేసి నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో సాయంత్రం పూట ఫాగింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. గత భారస ప్రభుత్వంలో కేటీఆర్ సూచనల మేరకు ప్రజల సమస్యల మీద ఎంతో చిత్తశుద్ధితో ముందుచూపుతో ఆలోచించి నియోజక వర్గ పరిధిలోని చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకు పేరుకొనిపోకుండా కాలనీవాసుల సౌలభ్యం కోసం దోమల నివారణకు డ్రోన్స్ సహాయంతో ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించి సఫలీకృతం కావడం జరిగిందన్నారు. డ్రోన్ పరిజ్ఞానం ఉపయోగించి చెరువు మధ్యలోకి వెళ్లడం సాధ్యం కాని చోట్ల కూడా దోమల నివారణకు మందులు చల్లినట్లు గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఇట్టి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాల మీద దృష్టి పెట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తుందన్నారు. ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్న హులుకులేదు పలుకులేదని అన్నారు. నోరు తెరిస్తే నోట్లోకి దోమలు పోతున్నాయని అన్నారు. ఇప్పటికి కూడా ఆయిల్ బాల్స్, గంబుజియా చేపల ప్రస్తావన ఎక్కడ లేకుండా ఇట్టి ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు.గత కొన్ని రోజులుగా సుధీర్ రెడ్డి దోమలపై యుద్ధం కార్యక్రమం చేయడం వల్ల ఇట్టి ప్రభుత్వంలో చలనం వచ్చి డివిజన్ కు ఒక్కో ఫాగింగ్ యంత్రం కేటాయించడం జరిగిందన్నారు. సుధీర్ రెడ్డి చేసిన పోరాట పటిమ వల్లే సాధ్యమైందని ప్రజలందరూ సంతోషిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎం సహాయ నిధి

**టియూఎఫ్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి**



**ఎల్ బినగర్, ఏప్రిల్ 10 (నినాదం):** పేదలకు వరం సీఎం సహాయ నిధి అని రాష్ట్ర టియూఎఫ్ఐడీసీ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి అన్నారు. శనివారం కడ్తల్ మండల పరిధిలోని ఓంపుగూడకి చెందిన పోతుగంటి అండాలుకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును చల్లా నరసింహా రెడ్డి అందచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహా రెడ్డి లకి అండాలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, మురళి గౌడ్,నర్సింహా మహేశ్వరం డివిజన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో వీదినపడ్డ నిరుపేద కుటుంబం





**కట్టుబట్టలతో మిగిలిన ముగ్గురు పిల్లలు, తల్లి**

**జవహర్‌నగర్, ఏప్రిల్ 10 (నినాదం):** విధి వంచించిన ఆ కుటుంబాన్ని అగ్నిప్రమాదం మరింత కుంగదీసింది. కష్టపడి సంపాదించుకున్న రూపాయి రూపాయి పోగేసి కొనుక్కున్న వస్తువులు, పిల్లల భవిష్యత్తుకు ఆధారం కావాల్సిన సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని బి జే ఆర్ నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను కన్నీరు పెట్టించింది.స్థానిక నివాసి అయిన రాధ అనే మహిళ, తన భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలను సాకుతూ ఇళ్లల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం ప్రమాదవశాత్తు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి.ఈ ప్రమాదంలో రాధ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. సుమారు 6, లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేసింది.పిల్లల విద్యా సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు పూర్తిగా కాలిపోయాయి.ఇంట్లో భద్రపరుచుకున్న పావు తులం బంగారం, దాచుకున్న నగదు బుగ్గిపాలయ్యాయి. బట్టలు, గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అన్నీ బూడిదయ్యాయి. భర్త లేని తరుణంలో, ఇళ్లల్లో బట్టలు ఉతుకుతూ, పనులు చేస్తూ పిల్లలను చదివిస్తున్న రాధకు ఇప్పుడు తలదాచుకోవడానికి నీడ కూడా లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడింది.చాలా కష్టపడి పిల్లలను పెంచుకుంటున్నాను. ఈ ప్రమాదం నన్ను కోలుకోలేని దెబ్బ తీసింది. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి," బాధితురాలు రాధ కన్నీటిపర్యంతమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బస్తీవాసులు, రాధ పరిస్థితిని చూసి చలించిపోయారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఈ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆర్థికంగా ఆదుకోవాలని బస్తీ వాసులు ముఖ్యంగా జవహర్ నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## ముందు కేటాయించిన స్థలంలోనే ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

**ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్**



**అల్వాల్, ఏప్రిల్ 10 (నినాదం):** ప్రస్తుతం కేటాయించిన స్థలంలోనే ఫైర్ స్టేషన్ ను నెలకొల్పే విధంగా చర్యలు తీసుకోవాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ ను హైడ్రా ను కోరడం జరిగిందని దానిని దృష్టిలో పెట్టుకుని హైడ్రా సీఐ మల్లేశ్వర్లు అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తో కలసి అల్వాల్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలము ను పరిశీలించారు ఇబ్బందులు తలెత్తకుండా స్థల రికార్డులు పరిశీలించి న్యాయ పరంగా చూస్తానని హైడ్రా అధికారి తెలియపరిచారు.

## ప్రభుత్వ పాఠశాల సాధించే వరకు పోరాటం ఆగదు






**తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కొరకు బస్తీ వాసులు ఏకమవ్వాలి**


**పాఠశాలల కొరకు కమిటీలు ఏర్పాటు అభినందనీయం**

**పబ్లిక్ హియరింగ్ బైట్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**జవహర్‌నగర్, ఏప్రిల్ 10 (నినాదం):** గబ్బిలాల పేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసే వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పష్టం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ గబ్బిలాల పేటలో, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ, వివిధ సంఘాల ఆధ్వర్యంలో పబ్లిక్ హియరింగ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ హాజరై మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించే ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాలైన గబ్బిలాల పేట, రాజీవ్ గాంధీ నగర్, శాంతినగర్, గిరి ప్రసాద్ నగర్, నందమూరి నగర్, ఈ ఐదు బస్తీలు కలుపుకొని గబ్బిలాల పేటలో ప్రభుత్వ హైస్కూల్ నిర్మించడం అత్యవసరమని, దాని సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. పాఠశాల నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ తరలింపుపై డిమాండ్ అనంతరం జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై ఆయన తీవ్ర స్థాయిలో స్పందించారు. డంపింగ్ యార్డ్ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల పేద ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే ఈ డంపింగ్ యార్డ్‌ను ఇక్కడి నుండి తరలించి, స్థానిక ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాలుష్య కోరల్లో చిక్కుకున్న జవహర్ నగర్ పరిసర ప్రాంతాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. అనంతరం తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారులు వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్య అందకపోతే బావి భారతం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లక్ష మందికి పైగా విద్యార్థులు ఉన్న జవహర్ నగర్ లో కేవలం రెండు హైస్కూల్ మాత్రమే ఉండడం బాధాకరమన్నారు. మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు బాల కార్మికులుగా మత్తు పదార్థాలకు బానిసరిగా మారుతున్నారన్నారు. సుజాత మాట్లాడుతూ అమ్మాయిలకు విద్య అందుబాటులో లేకపోవడంతో బాల్యవివాహాల బారిన పడుతున్నారన్నారు. కన్నెగంటి రవి మాట్లాడుతూ అభివృద్ధి చెందింది అని చెబుతున్న తెలంగాణలో పాఠశాలల కోసం పోరాటం చేయవలసిన దుస్థితి రావడం సిగ్గుచేటు అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు శ్రీ వివిఎన్ బోస్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్ రెడ్డి, శంకర్, నరసింహులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, అధ్యక్షులు రజనీకాంత్, మాజీ కార్పొరేటర్లు, చిత్ర సుబ్రహ్మణ్యం, మేక లలిత యాదవ్ ,శాంతి కోటేష్ గౌడ్, తురుగొండ రామన్న, స్థానిక బస్తీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీడిమెట్ల సర్కిల్లో మెగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



**శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం ఉంటుంది**

**ఉప కమిషనర్ శంకర్ సింగ్**

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 10 (నినాదం) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో 36 వ రోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లో మెగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. గాయత్రీ నగర్, 285 వార్డు కుత్బుల్లాపూర్, జీడిమెట్ల సర్కిల్ 55, కుత్బుల్లాపూర్ జోన్, సి.ఎం.సి పరిధిలో ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించారు. మెగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా చెట్ల కొమ్మల కత్తిరింపు, ఆక్రమణల తొలగింపు, గుంతల పూడ్చివేత, పారిశుధ్య పనులు నిర్వహించారు. మెగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ప్రతి శనివారం ప్రతి కాలనీ లో నిర్వహించడం జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరి రెడ్డి అడిషనల్ కమిషనర్ సానిటేశన్, సిఎంసి, డి శంకర్ సింగ్ డిప్యూటీ కమిషనర్, జీడిమెట్ల సర్కిల్–55, కె. సునీత అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్, మహేందర్ యు బి డి మేనేజర్, ఖాసిఫ్ హుస్సైన్ డిప్యూటీ ఈ ఈ ఎస్ డబ్ల్యూ ఎం, సాయి లికిత, ఏ ఈ ఎస్ డబ్ల్యూ ఎం, యు సి డి సిబ్బంది, జిలానీ పాషా, జవాన్ సానిటేశన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పుట్టి ముంచిన ఫిరాయింపు!

**ఉమ్మడి కరీంనగర్ జిల్లాపై తీవ్ర ప్రభావం**
**జగిత్యాల బిఆర్ఎస్‌లో ఫుల్‌జోష్**
**ఎర్రవెల్లి ఫామ్‌లో కెసిఆర్, జీవన్ రెడ్డి**



**జగిత్యాల ప్రతినిధి మార్చి 10 (నినాదం) :** 10 మంది బి ఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. 9 మందితో ఏ పంచాయతీ లేదు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఫిరాయింపుతో పుట్టిన ముసలం చిలికి చిలికి గాలివాన గా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మనుగడకు కు ముప్పు తెచ్చిపెట్టింది. రాజకీయాల్లో పట్టువిడుపులు ఉండాలి అనే చిన్న ధర్మ సూక్ష్మాన్ని మరిచిన అధిష్టానం భారీ మూల్యాన్ని చెల్లించు కొనే పరిస్థితులు తెచ్చుకుంది.. నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీని కష్టకాలంలో పట్టుకొని కాపాడిన సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరింది ఒకటే. జెండా మోసిన కార్యకర్తల కష్టాన్ని దోచుకోకండి... వారి హక్కులను కాపాడండి... స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి ప్రాధాన్యత కల్పించండి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జీవన్ రెడ్డి న్యాయమైన కోరికలను ఒకటి కూడా మన్నించలేదు. బి ఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటున్న సంజయ్ కుమార్ గాంధీభవన్ సమావేశంలో ఎలా పాల్గొంటారని జీవన్ రెడ్డి చేసిన రచ్చను లైట్ తీసుకున్నారు. చివరి అంకంలో జీవన్ రెడ్డితో ఏమీ కాదని తేలిక భావంతో వ్యవహరించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జీవన్ రెడ్డి వ్యూహానికి దిమ్మ తిరిగి బొమ్మ కనబడింది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మాజీ మంత్రి జీవన్ రెడ్డి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు టికెట్ ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ వ్యతిరేకించిన కచ్చితంగా ఎమ్మెల్యే టికెట్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఇవ్వాలని పట్టుబట్టి ఆయన గెలుపులో కూడా ముఖ్య భూమిక పోషించారు. మొన్న జరిగిన డిసిసి ఎన్నికల్లో కచ్చితంగా సీనియర్ కాంగ్రెస్ ద్వితీసే ద్వితీయ శ్రేణి నాయకులకు డిసిసి దక్కాలని జువ్వాడి నర్సింగరావు ను పక్కన పెట్టించి గాజంగి నందయ్యకు డిసిసి చైర్మన్ పట్టం కట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జగిత్యాల మున్సిపల్ కౌన్సిలర్లలో జీవన్ రెడ్డి ప్రతిపాదించిన ఇండిపెండెంట్లు కాంగ్రెస్ బీఫాం ఇచ్చిన వారి కంటే ఎక్కువ మంది గెలిపించుకొని జీవన్ రెడ్డి మరోసారి తన రాజకీయ చతురతను నిరూపించారు. అయినా ఢిల్లీ అధిష్టానం పట్టించుకోలేదు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు లైట్ తీసుకున్నారు. గులాబీ కండువా పక్కన పెట్టిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేని అని చెప్పుకుంటూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో తలమును కలయ్యారు. కలిసి పనిచేస్తున్న అభివృద్ధి చేస్తున్న అంటూ నియోగ వర్గం ప్రజల చెవుల్లో కాలీఫ్లవర్ పెట్టే ప్రయత్నం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పెండింగ్ బకాయిలను రాబట్టుకునేందుకు తన బంధువు కోసం పార్టీ ఫిరాయించి ఈ క్రమంలో మరో వంద కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. మరో సంవత్సర కాలం పాటు కాంగ్రెస్లోనే ఎంజాయ్ చేసి బిఆర్ఎస్ లో చేరదామనుకునే వ్యూహానికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి చెక్ పెట్టారు. నాలుగు దశాబ్దాల ప్రాతిపత్యాన్ని చివరి అంకంలో జీవన్ రెడ్డి పార్టీని వదిలేస్తారని ఎవరు కూడా ఊహించలేదు. జీవన్ రెడ్డి అంశం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం అలజడి లేపుతున్న అంశం. ఫిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వల్ల కాంగ్రెస్ పార్టీకి ఎంత లాభం జరిగిందో తెలియదు కానీ జరిగిన నష్టం మరింత పెరగనుంది. జీవన్ రెడ్డి ఫైనాన్షియర్ కాదు.. పబ్లిక్ ను ప్రభావితం చేయగల రాజకీయ భీష్ముడు. ప్రస్తుతం కెసిఆర్ పక్కన చేరారు. జీవన్ రెడ్డి వ్యూహాత్మకమైన రాజకీయ పన్నాగాలను తట్టుకోవడం కష్టమే అవుతుంది. గత రెండు సంవత్సరాల నుంచి 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించిన జగిత్యాల ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుపై చేసిన అలజడి రెండు సంవత్సరాలుగా జీవన్ రెడ్డి ట్రెండింగ్ లోనే ఉంటూ వచ్చారు. రాజ్యాంగబద్ధంగా కాంగ్రెస్ పార్టీకి సభ్యత్వానికి రాజీనామా చేసి బి ఆర్ఎస్ లో చేరి గులాబీ కండువా కప్పుకొని రేపటి నుంచి చేసే పోరాటం కాంగ్రెస్ పార్టీకి చెప్పులో రాయి చెవులు జోరీగా కానుంది. బి ఆర్ఎస్ అధినేత కెసిఆర్ అమ్ముల పోదిలో జీవన్ రెడ్డి ఓ బ్రహ్మాస్త్రం. అత్యంత చాకచక్యంగా జీవన్ రెడ్డిని రాష్ట్రంలో వాడుకొని కాంగ్రెస్ను దెబ్బతీయడం కోసం రాజకీయ వ్యూహాలకు గులాబీ బాస్ సమయతమవుతున్నట్టు తెలుస్తుంది. ఇప్పుడు జీవన్ రెడ్డికి డబ్బుల కొరత లేదు. కార్యకర్తలకు కొదవ అంతకన్నా లేదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, చొప్పదండి, కోరుట్ల మెట్పల్లి, నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ లోని మరికొన్ని నియోజకవర్గాలను జీవన్ రెడ్డి పూర్తిస్థాయిలో ప్రభావితం చేయగలరు. పార్టీ పేరు చెప్పుకోవడానికి నా మూషిగా ఫీల్ అయ్యే ఫిరాయింపు ఎమ్మెల్యేకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇచ్చి జీవన్ రెడ్డిని దూరం చేసుకోవడం మూలంగా ఏం మూటకటుకుంటుందో రానున్న రోజుల్లో తేట తెల్లం కానుంది. కెసిఆర్ మునుపటిలాగా అహంభావానికి ఫులిస్టాప్ పెట్టినట్లు కేసిఆర్ సన్నితులు చెబుతున్నారు. బి ఆర్ఎస్ గతంలో చేసిన పొరపాట్లను సమూలంగా సవరించుకొని సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి కనుసన్నల్లో పార్టీ నడిపించాలని ఒక ఆలోచనకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. బి ఆర్ ఎస్ కండువా కప్పుకున్న మరుసటి రోజు నుంచి జీవన్ రెడ్డి రాజకీయ వ్యూహాలకు పదును పెట్టనున్నట్లు తెలుస్తుంది. మైకుల ముందు నిలబడి ప్రభుత్వ పెద్దలను క్యారెక్టర్ అసోసియేషన్ జీవన్ రెడ్డి ఎప్పుడు చేయరు. విధానపరమైన సమస్యలను లేవనెత్తి ఊపిరి సల్పకుండా ప్రజల మెప్పు పొందే విధంగా విమర్శలు చేయడంలో జీవన్ రెడ్డి నేర్పరి. పార్టీ ఫిరాయింపు మరుసటి రోజు నుంచి మొన్నటి వరకు జగిత్యాల ఎమ్మెల్యే ను వ్యక్తిగత దూషణలు లేకుండా ముప్పు తిప్పలు పెట్టిన సంగతి రాష్ట్ర ప్రజలకు విధితమే. ప్రస్తుతం జగిత్యాల నియోజకవర్గం లో కాంగ్రెస్ టిఆర్ఎస్ కేడర్ సగం కలిసి పని చేసే సూత్రానికి అలవాటు పడి ఎడమచేత్తో కాంగ్రెస్ కండువా కుడిచేత్తో గులాబీ కండువా పట్టుకుని వ్యవహరిస్తున్న తీరుకు జీవన్ రెడ్డి చేరికతో ఎండ్ కార్డు పడింది. జీవన్ రెడ్డి టిఆర్ఎస్ లో చేరిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నాయకుల్లో వణుకు పుట్టించిందని మాట వాస్తవం. పైకి మేకపోదు గాంభీర్యం నటించిన వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదనేది ఇప్పటికే చాలామందికి తెలిసిన చేదు నిజం.




# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**ఇప్ప పువ్వు , తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి**
**అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు**
**అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ**
**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.**

**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 10 నినాదం:** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని,ఇప్ప పువ్వు , తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి లభిస్తుందని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగు తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయల సి ఆర్ ఆర్ నిధుల తో చేపట్టనున్న అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు, అంకంపల్లి గ్రామంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఐటిడిఎ నిధులు సుమారు 83 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి అంకంపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. అదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు. స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పన పలు అంశాలపై అంగన్వాడి చిన్నారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మారుమూల ప్రాంతాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. అంకంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అన్ని మౌలిక వస్తువులు కల్పిస్తూ మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. గూడు లేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో ములుగు నియోజక వర్గానికి 5000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం రెండో విడతను ప్రారంభించడం జరుగు తుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్థానిక ఉత్పత్తులైన ఇప్ప పువ్వు తేనె సేకరణ వంటిపనులను చేపట్టడం ద్వారా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తా యని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని పేర్కొన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, మెనూలో ఎటువంటి లోపాలు చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**ఉచిత ఆయుష్ ఆరోగ్య శిబిరం ప్రారంభం**

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 10 (నినాదం):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 6:30 గంటల నుండి 7:30 గంటల వరకు నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ దీనిని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ భవనంలో ఏర్పాటు చేసిన ఆయుష్ ఆరోగ్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ శ్రీ పాండు ప్రారంభించారు. ఈ శిబిరంలో యునాని, హోమియోపతి మరియు ఆయుర్వేద వైద్యులు ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే అదనంగా రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి పరీక్షలు కూడా నిర్వహించబడ్డాయి. దీర్ఘకాలిక జబ్బులకు ఆయుష్ మందులు వాడటం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండుతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.వసంతరావు, డి.డబ్ల్యూ.ఓ లలిత కుమారి, ఎంఆర్ఓ జయరాం, రిటైర్డ్ ఎంప్లాయీస్, వైద్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# ఆయుర్వేద, యునాని, హోమియోపతిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

**జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్.**

**నల్గొండ ప్రతినిధి ఏప్రిల్ 10 (నినాదం) :** ప్రజలు సహజ వైద్య విధానాల వైపు మళ్లేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను సూచించారు శుక్రవారం హోమియోపతి డే సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద, యునాని, హోమియోపతి విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ సామ్యూల్ హానీమన్ చిత్రపటానికి పూలమాల అర్పించి నివాళులు ఘటించారు. హోమియోపతి నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, బయట తినుబండారాలను తగ్గించి, శుభ్రమైన మరియు పోషకాహారం, తాజా పండ్లు తీసుకోవాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఇతరులకు సేవ చేయగలుగుతారని , వైద్య వృత్తిలో ఉన్నవారు ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరమని తెలిపారు.అలాగే గతంలో క్యాన్సర్, ప్లేగు వంటి వ్యాధులకు సరైన చికిత్సలు లేక ప్రజలు ప్రాణాలు కోల్పోయేవారని, ప్రస్తుతం వైద్య రంగంలో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. అయితే సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద, యునాని, హోమియోపతి వైద్య విధానాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.. విద్యార్థులు నిత్యం వ్యాయామం, యోగా, జిమ్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్య శిబిరం ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్వో వేణుగోపాల్ రెడ్డి, యునాని వైద్య అధికారి డాక్టర్ ముబీన్ పర్వీన్, ప్రోగ్రాం ఇన్చార్జ్ సుహాసిని,డిప్యూటీ సూపరింటెండెంట్ గణేష్ ,తదితరులు, హాజరయ్యారు.



N NADAM CINEMA

## డెకాయిట్.. అడవి శేష్ కెరీర్‌లో
# అత్యుత్తమ ప్రదర్శన

**నటుడు నాని ప్రత్యేక అభినందనలు**



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్ 'డెకాయిట్' శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ నేపథ్యంలో నేచురల్ స్టార్ నాని ఈ చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించాడు. అడివి శేష్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ ప్రదర్శన అని, 'డెకాయిట్' ఒక నిజమైన బ్లాక్ బస్టర్ అని ఎక్స్ వేదికగా కొనియడారు. 'డెకాయిట్' సినిమా ప్రీమియర్ చూసిన అనంతరం నాని తన ఎక్స్ ఖాతాలో స్పందిస్తూ, 'డెకాయిట్.. ఒక నిజమైన బ్లాక్ బస్టర్! ఈ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను అస్సలు మిస్ కావద్దు. అడివి శేష్ అద్భుతంగా నటించాడు, తన కెరీర్‌లో ఇదే బెస్ట్ పెర్ఫార్మెన్స్. అడివి శేష్‌కు, రచయిత అబ్బూరి రవి గారికి, స్క్రీన్ ప్లే విభాగానికి నా అభినందనలు అని నాని పేర్కొన్నారు. అలాగే హీరోయిన్ మృణాల్ ఠాకూర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, 'మృణాల్.. ఈ పాత్రలో నువ్వు చాలా అందంగా లీనమైపోయావు. నీ ఖాతాలో మరో గొప్ప సినిమా చేరింది' అని ప్రశంసించారు. చిత్ర దర్శకుడు షనీల్ డియో పనితీరును, సంగీతాన్ని మరియు విజువల్స్‌ను నాని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఈ ఏడాదిలోనే ఒక అద్భుతమైన చిత్రాన్ని నిర్మించారని నాని కొనియాడారు. నాని చేసిన పోస్ట్‌పై అడివి శేష్ స్పందిస్తూ, థాంక్యూ సో మచ్ బిగ్ బ్రో. మీ రివ్యూ చూశాక మా టీమ్ అంతా చాలా ఉత్సాహంగా ఉన్నారు. మీ మాటలు నాకు ఎంతో ప్రత్యేకం. నిజంగా నా మనసు నిండిపోయిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సినిమాకు ప్రీమియర్ నుంచే పాజిటివ్ రివ్యూలు వస్తుండటంతో 'డెకాయిట్' బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.







# నటుడు ప్రభాస్ లెజెండ్

**దురంధర్ దర్శకుడు ఆదిత్యధర్ కితాబు**

బాలీవుడ్ సెన్సేషన్ డైరెక్టర్ ఆదిత్య ధర్ మన రెబల్ స్టార్ ప్రభాస్ కు 'లెజెండ్' అంటూ కితాబిచ్చేశారు. రెబల్ స్టార్.. ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ఇవి ప్రభాస్ ను ఫ్యాన్స్ ముద్దుగా పిలుచుకునే పేర్లు. ఈశ్వర్ తో మొదలైన ప్రభాస్ జర్నీ నేడు దేశం గర్వించే రేంజ్ కు చేరుకుంది. కానీ మన డార్లింగ్ చాలా సింపుల్ గా కూల్ గా ఉంటాడు తప్ప స్టార్‌డమ్ గురించి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోరు. ఎంతటి వారైనా ప్రభాస్ తో కలిసి వర్క్ చేసారంటే ప్రేమలో పడిపోవాల్సిందే. తాజాగా ఇటీవల సందీప్ రెడ్డి వంగాతో కలిసి 'ధురంధర్ 2' సినిమాను వీక్షించారు ప్రభాస్. అయితే, సినిమా చూసి సైలెంట్‌గానే వెళ్ళిపోయాడు డార్లింగ్. కనీసం సోషల్ మీడియాలో రివ్యూ కూడా ఇవ్వలేదు. కానీ, ఆ సినిమా దర్శకుడు ఆదిత్య ధర్ స్పందించిన తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సందీప్ రెడ్డి వంగా చేసిన పోస్ట్‌కు రిప్లై ఇచ్చిన ఆదిత్య.. 'ది లెజెండ్ ప్రభాస్ సర్‌కి నా ప్రేమను తెలియజేయండి' అంటూ ట్వీట్ చేశారు. ఇక్కడి నుంచి సోషల్ మీడియాలో లెజెండ్ ప్రభాస్ ట్యాగ్స్ ఓ రేంజ్‌లో ట్రెండ్ అవుతున్నాయి. ఇప్పటికే సందీప్ రెడ్డి వంగా ఆయనను 'ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్' అనే బిరుదు ఇచ్చారు. ఇప్పుడు మరో సంచలన దర్శకుడు ఆదిత్య ధర్ ఏకంగా 'ది లెజెండ్' అని ట్యాగ్ ఇవ్వడంతో.. రెబల్ స్టార్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో రచ్చ రచ్చ చేస్తున్నారు. ఆదిత్య ధర్ లాంటి దర్శకులు ప్రభాస్ పట్ల చూపిస్తున్న ఈ గౌరవం చూస్తుంటే, ఆయన కేవలం ఒక నటుడు మాత్రమే కాదు, ఇండియన్ సినిమాకు ఒక బ్రాండ్ అని కామెంట్స్ చేస్తున్నారు.

# మైఖేల్‌జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల

ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లు డు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వే జ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుం డటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెం డరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.




## హాట్ టాపిక్‌గా మారిన
# 'రాకా' రెమ్యూనరేషన్లు..



ఎవరెవరు ఎంతెంత తీసుకుంటున్నారంటే టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ సెట్ అయిన సంగతి తెలిసిందే. 'రాకా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ఇప్పుడు పారితోషికాలతో ఇండస్ట్రీ వర్గాలను షాక్‌కు గురిచేస్తోంది. సన్ పిక్చర్స్ ఏమాత్రం వెనకాడకుండా ఈ చిత్రం కోసం భారీగా ఖర్చు చేస్తున్నట్లు టాక్. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా కోసం అల్లు అర్జున్ ఏకంగా రూ. 175 కోట్లు తీసుకోబోతున్నారట. సౌత్ ఇండియాలో ఒక హీరోకి ఈ స్థాయిలో పారితోషికం అందడం అంటే అది మామూలు విషయం కాదు. ఇక గ్లోబల్ బ్యూటీ దీపికా పదుకొణె ఈ చిత్రంలో మెయిన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆమెకు రూ. 25 కోట్లు ఇస్తున్నట్లు టాక్. అంటే సౌత్ సినిమాల్లో ఒక హీరోయిన్ తీసుకుంటున్న అత్యధిక రెమ్యూనరేషన్ ఇదే కావచ్చు. ఈ మూవీలో కేవలం దీపికా మాత్రమే కాదు.. రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ వంటి స్టార్ భామలు కూడా నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక నేషనల్ క్రష్ రష్మిక ఈ చిత్రం కోసం రూ. 5 నుండి 7 కోట్ల వరకు పారితోషికం అందు కుంటున్నట్లు సోషల్ మీడి యాలో పలు పోస్టులు హల్ చల్ చేస్తున్నాయి. ఇంతమంది స్టార్ హీరోయిన్లను ఒక్క సినిమాలో చూపిస్తున్నారంటే.. అట్లీ ప్లాన్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఇటీవల బన్నీ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ విపరీతమైన క్రేజ్ తెచ్చిపెట్టింది. కొంత మంది విమర్శలు చేసినా, అంచనాలు మాత్రం ఆకాశాన్ని తాకాయి. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 చివరి నాటికి థియేటర్లలోకి తీసుకురావాలని చిత్ర యూనిట్ గట్టిగా ప్రయత్నిస్తోంది.

## కొరియన్ కనకరాజు నుంచి
# కమ్సాహంనిదా' పాట ప్రోమో

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' . ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.






ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787